www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -149 శుక్రవారం 29 ఆగస్టు 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## 75 ఏళ్లకు పదవీ విరమణ లేనే లేదు



### ప్రతి జంటా ముగ్గురు పిల్లలను కనాలి

**జనాభా తగ్గకుండా కాపాడుకోవాలి**

**ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్**

న్యూఢిల్లీ,,**ఆగస్టు 28ప్రజావినికిడి,**

ప్రతి భారతీయ జంటకు ముగ్గురు పిల్లలు ఉండాలని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. ప్రతి మహిళకు 2.1 మంది పిల్లలు అనే ప్రత్యామ్నాయ జనన రేటును ఆయన వెల్లడించారు. గురువారం ఆయన ఢిల్లీలో విలేకరుల సమావేశంలో జనాభా అంశంపై మాట్లాడారు. మూడు కంటే తక్కువ జనన రేటు ఉన్న సమాజాలు నెమ్మదిగా అంతరించిపోతున్నాయని నిపుణులు చెబుతున్నారని భగవత్ అన్నారు. కావున, మూడు కంటే ఎక్కువ జనన రేటును కొనసాగించాలని, మిగతాది 2లో...

# ఉత్తర తెలంగాణ అతలాకుతలం

## కామారెడ్డి,మెదక్ జిల్లాల్లో తీరని నష్టం



- చెరువుల్ని తలపించిన కాలనీలు
- స్తంభించిన జనజీవనం
- పదిమంది మరణించినట్టు డీజీపీ ప్రకటన
- మరో మూడ్రోజులు అతిభారీ వర్షాలే
- శాశ్వత ప్రాతిపదికన హైలెవల్ బ్రిడ్జిలు
- సహాయక చర్యలు ముమ్మరం చేయండి..
- మెదక్ జిల్లా వరద ప్రాంతంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే



2లో.

అల్పపీడనం అతలాకుతలం చేసింది. అల్పపీడన ప్రభావంతో కామారెడ్డి, మెదక్, నిర్మల్ జిల్లాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు కుంభవృష్టి కురియడంతో భారీ నష్టం జరిగింది. చెరువుల, కాలువులు పొంగిపొర్లాయి. కల్వర్లు, రోడ్లు తెగాయి. ముఖ్యంగా కామారెడ్డి, మెదక్ జిల్లాలు భారీ వర్షాలతో ఉక్కిరిబిక్కిరి అయ్యాయి. తెలంగాణలోని పలు ప్రాంతాల్లోనూ అత్యంత భారీ వర్షాలు కురిశాయి. భారీ వర్షాల నేపథ్యంలో కామారెడ్డి, మెదక్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. కామారెడ్డి జిల్లాలో కురిసిన భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పంట పొలాలు, నివాస ప్రాంతాలు చెరువులను తలపించాయి. దాదాపు పంటలన్నీ దెబ్బతిన్నాయి.

## విదేశీ విద్యార్థులకు ట్రంప్ మరో షాక్

- అమెరికాలో 'డ్యురేషన్ ఆఫ్ స్టే' కుదించే ప్రతిపాదన
- నాలుగేళ్లకు మించి ఉండకుండా కట్టడి చేయనున్న ట్రంప్
- విద్యార్థుల వీసాల్లో కీలక మార్పులకు ప్రయత్నాలు



2లో.

## ఏపీ లోనూ వర్షాలు అధికారుల అప్రమత్తం

**అధికారులతో సమీక్షించిన హోంమంత్రి అనిత**

**వినాయక నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలన్న గొట్టిపాటి**

అమరావతి**ఆగస్టు 28ప్రజావినికిడి,)**బంగాళాఖాతంలో అల్పపీడనంతో ఏపీ వ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులతో హోంమంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. వివిధ జిల్లాల కలెక్టర్లతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు- చేయాలని మంత్రి ఆదేశించారు. కృష్ణా పరివాహకంతో పాటు- లోతట్టు- ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. మిగతాది 2లో...



## తక్షణ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి

**భారీ వర్షాలతో పలుచోట్ల రోడ్లకు గండ్లు**

**రోడ్లు దెబ్బతిన్న ప్రాంతంలో హెచ్చరిక బోర్టులు**

**అధికారులను ఆదేశించిన మంత్రి కోమటిరెడ్డి**

హైదరాబాద్,**ఆగస్టు 28ప్రజావినికిడి,**

భారీ వర్షాలతో పలుచోట్ల రోడ్లకు గండ్లు పడ్డందున, రోడ్లు దెబ్బతిన్న ప్రాంతంలో హెచ్చరిక బోర్టులు ఏర్పాటు చేయాలని, తక్షణ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించచారు. రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆర్ అండ్ బి అధికారులను అలెర్ట్ గా ఉండాలని ఆదేశించారు.. మిగతాది 2లో...



## క్రీడల్లో తెలంగాణ అగ్రగామిగా నిలవాలి

**అందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలి**

**స్పోర్ట్స్ హబ్ బోర్డు సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్**ఆగస్టు 28ప్రజావినికిడి,**

తెలంగాణలో ఐటీ సంస్కృతి బలంగా ఉంది. రాష్ట్రంలో ప్రతి కుటుంబం తమ పిల్లలు ఐటీ రంగంలో రాణించాలని కోరుకుంటున్నారు. అదే తరహాలో తెలంగాణలో క్రీడా సంస్కృతి రావాలి. క్రీడల్లో తెలంగాణ అగ్రగామిగా నిలవాలి. అందుకు తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు తగిన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సూచించారు.. మిగతాది 2లో...



# రేవంత్ నీరో చక్రవర్తి

## సిరిసిల్ల జిల్లా వరద ప్రాంతాల్లో కెటిఆర్ పర్యటన



**వరదనష్టంపై ఆరా తీసిన బిఆర్ఎస్ నేత**

**రేవంత్ నీరో చక్రవర్తి అంటూ విమర్శలు**

**సిరిసిల్ల జిల్లాలో వరద సందర్శనలు**

**ఎదురుపడ్డ కెటిఆర్ బండి..పలకరింపులు**

సిరిసిల్ల,**ఆగస్టు 28ప్రజావినికిడి,**

భారీ వర్షాల కారణంగా ప్రజలు ఇంత అవస్థలు పడుతుంటే సిఎం రేవంత్ రెడ్డికి పట్టింపులేనట్లుగా ఉందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. దోమకొండ చెరువు తెగిపోయి కామారెడ్డి రాకపోకలు నిలిచిపోయాయని అన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ సిరిసిల్లలో మీడియాతో మాట్లాడుతూ.. రోమ్ నగరం తగలపడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్లుగా ఉందని, వరదలు ముంచెత్తుతుంటే మూసీ సుందరీకరణ గురించి, ఒలింపిక్స్ క్రీడల గురించి సమీక్ష



చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో ఖమ్మంలో వరదలు వస్తే కూడా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 25 లక్షల చొప్పున పరిహారం ప్రకటించాలని, రైతులకు ఎకరాకు రూ. 25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పనిచేయక పోయినా.. మిగతాది 2లో...

## తెలంగాణ సీఎస్ సర్వీసు పొడిగింపు



తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు సర్వీసును పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎస్ రామకృష్ణారావు పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది. పదవీ విరమణ చేయవలసి ఉండగా, ఆయన సర్వీసును పొడిగించాలని డీవోపీటీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోరింది.రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్రం మరో ఏడు నెలల పాటు రామకృష్ణారావు సర్వీసును పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీనితో 2026 మార్చి వరకు రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగనున్నారు.

## మోదీ కూడా ఓట్ల దొంగతనానికి పాల్పడ్డారు

**: రాహుల్ గాంధీ**

- బీహార్‌లో రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర'
- బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కై ఓట్లు తొలగించారని రాహుల్ ఆరోపణ
- రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని వ్యాఖ్య
- బాధితుల్లో ఎక్కువగా బడుగు బలహీన వర్గాలవారేనని ఆరోపణ



2లో.

# ఉత్తర తెలంగాణ అతలాకుతలం

హైదరాబాద్:**ఆగస్టు 28ప్రజావినికిడి,**
భారీ వర్షాలు, వరదలతో ఉత్తర తెలంగాణ వణికిపోయింది. రోడ్లు, కాలనీలు, ఇండ్లు, చెరువులు, కుంటలు, కాల్వలు అనే తేడా లేకుండా అన్నీ జలమయం అయ్యాయి. గతంలో ఎన్నడూ ఈ తరహా జలవిపత్తును చూడలేదని స్థానికులు ఆందోళనలు వ్యక్తం చేశారు. గతంలో లోతట్టు ప్రాంతాలే ముంపునకు గురయ్యేవి. ఇప్పుడు లోతట్టు, మెరక ప్రాంతాలనే తేడా లేకుండా అన్నీ నీటమునిగాయి. వరద భీభత్సానికి స్థానిక అధికార యంత్రాంగం చేష్టలుడిగిపోయింది. ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. ప్రాణనష్టాన్ని నివారించాలనే ఏకైక లక్ష్యంతో అధికారులు పనిచేశారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా సిబ్బంది సహాయ చర్యలకు ఆటంకాలు ఏర్పడటంతో, ప్రభుత్వం దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అధికారుల్ని సంప్రదించింది. దీనితో ఎయిర్‌ఫోర్స్ అధికారులు ఏరియల్ సర్వే చేసి, ప్రమాదంలో ఉన్న అనేకమందిని హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించారు. కామారెడ్డిలో అధికారులతో సమీక్ష నిర్వహించాలని సీఎం భావించారు. కానీ ఆయన హెలికాప్టర్ దిగేందుకు అనువైన ఖాళీస్థలం లేకపోవడంతో, తిరిగి హైదరాబాద్‌కు వచ్చేశారు. ఆ స్థాయిలో వర్షాలు, వరదలు ఉత్తర తెలంగాణను ముంచెత్తాయి. పంటలు నీట మునిగాయి. వందలాది మూగజీవాలు వరదల్లో కొట్టుకుపోయాయి. వరద ప్రాంతాలన్నీ హృదయవిదారక దృశ్యాలతో చలింపచేస్తున్నాయి. భారీ వర్షాలు, వరదలతో పదిమంది మరణించారని డీజీపీ జితేందర్ ప్రకటించారు. వచ్చే మూడ్రోజులు కూడా ఇదే తరహా భారీ వర్షాలు ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.



భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణమే స్పందించాలని, సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మెదక్ జిల్లాలోని హవేళీఘన్‌పూర్ మండలంలో జరిగిన వరద నష్టాన్ని గురువారం సాయంత్రం ఆయన ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో హెలిప్యాడ్ ల్యాండ్ అయిన తర్వాత కలెక్టరేట్‌కు చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులు, ఎమ్మెల్యేలతో వరదలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పంట నష్టం, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం అంచనాలకు అనుగుణంగా నష్టపరిహారానికి యుద్ధప్రాతిపదికన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా వరద నష్టాల అంచనాలు వేస్తూ శాశ్వత ప్రాతిపదికన హై లెవల్ బ్రిడ్జిలు కట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. మెదక్ జిల్లాలో వర్షాలు, వరదల వల్ల వాటిల్లిన నష్టానికి సంబంధించిన ఫొటోలతో కూడిన ఎగ్జిబిషన్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. ఏరియల్ వ్యూ ద్వారా వరదల్ని పరిశీలించిన సీఎం.. ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా నష్టాన్ని స్వయంగా చూశారు. జిల్లాల్లో యూరియా కొరత విషయంలో బఫర్ స్టాక్ డిస్‌ప్లే చేస్తున్నామని రైతులకు రాబోయే పంటలకు కూడా ఇప్పటి నుండే యూరియా కొనుగోలు చేయడం వల్ల కొరత ఏర్పడుతుందని, నానో యూరియాపై రైతులకు అవగహన కల్పించాలని అన్నారు. సీఎం పర్యటనలో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతారావు, కలెక్టర రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు.

# రేవంత్ నీరో చక్రవర్తి

**(మొదటి పేజీ తరువాయి)**
అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని కెటిఆర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా వరదలు ముంచెత్తుతుంటే.. మూసీ సుందరీకరణపై సమీక్షనా.. అంటూ రేవంత్ రెడ్డిపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. సిరిసిల్లలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం కేటీ-ఆర్ మీడియాతో మాట్లాడారు. రాబోయే నాలుగు రోజుల పాటు- వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతుంది. ప్రస్తుతం పంట నష్టం ఎంత జరిగింది..? ఆస్తి, ప్రాణ నష్టం ఎంత జరిగింది..? ఎంత మంది విపత్తుల్లో ఉన్నారు..? అని చూడడం ముఖ్యమా అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల్లో వరదలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు హెలికాప్టర్‌లను పంపి సామాన్యుల ప్రాణాలను కాపాడడం జరిగింది. ఇవాళ మన రాష్ట్రానికి చెందిన హెలికాప్టర్లు బీహార్ ఎన్నికల ప్రచారంలో తిరుగుతున్నాయి. ఇంకా ఎక్కడెక్కడ్నో తిరుగుతున్నయ్ తప్ప సామాన్యులకు అందుబాటులో లేవు. ఖమ్మంలో వరదలు వస్తే పట్టించుకున్న నాథుడు లేడు. ముగ్గురు మంత్రులున్నా ఖమ్మం జిల్లాకు హెలికాప్టర్‌ను పంపలేదు. చివరకు ఇవాళ నర్మాలలో చిక్కుకున్న ఐదుగురిని ఎన్డీఆర్ఎఫ్ హెలికాప్టర్ వచ్చి కాపాడింది. ఒక వ్యక్తి వరదలో కొట్టుకుపోయాడు. కొంత ఆస్తి నష్టం, పంట నష్టం కూడా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని ఉంటే ఇంత నష్టం జరిగి ఉండకపోయేది. ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని ఎక్కడైతే పంట నష్టం జరిగిందో అక్కడ ఎకరానికి రూ. 25 వేలు పరిహారం ఇవ్వాలి. ప్రాణ నష్టం జరిగిన కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి. కూలిపోయిన ఇండ్లకు వాటి స్థానంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మా నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పర్యటిస్తూ సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారని కేటీ-ఆర్ పేర్కొన్నారు. వరద బాధితులకు ఆహారం, వైద్య సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజలను ఆదుకునే ప్రయత్నం చేస్తాం. రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తున్నానని కేటీఆర్ తెలిపారు.

### సిరిసిల్ల జిల్లాలో వరద సందర్శనలు

#### ఎదురుపడ్డ కెటిఆర్ బండి..పలకరింపులు

రాజన్న సిరిసిల్ల జిల్లా నర్మాలలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. నర్మాలలో వరద బాధితులను పరామర్శించి వస్తుండగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎదురుపడ్డారు. బండి సంజయ్‌ను చూడగానే ఆయన కాన్వాయ్ వద్దకు కేటీఆర్ వచ్చారు. వాహనం దిగి కేటీఆర్ వద్దకు వచ్చిన బండి సంజయ్ అభివాదం చేశారు. బాగున్నారా అంటూ ఒకరికొకరు పలుకరించుకున్నారు. కష్టపడుతున్నవంటూ ఈ సందర్భంగా బండి సంజయ్‌ను ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు. అనంతరం నర్మాల బాధితులను పరామర్శించేందుకు కేటీఆర్ వెళ్లిపోయారు.

# క్రీడల్లో తెలంగాణ అగ్రగామిగా నిలవాలి

**(మొదటి పేజీ తరువాయి)**
గురువారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు సమావేశం జరిగింది. రాష్ట్రంలో స్టేడియాల నిర్వహణ, వసతుల ఆధునీకరణ, కోచ్‌లకు శిక్షణ, క్రీడా పాలసీలో పలు అంశాలపై ప్రణాళిక రూపకల్పన, నిర్ణయాల అమలుకు సబ్ కమిటీల ఏర్పాటు తీర్మానాలు చేసింది. ఖేలో ఇండియా, కామన్‌వెల్త్ గేమ్స్ సహా ఒలింపిక్స్ పోటీలు భారత్‌లో నిర్వహిస్తే.. సహ ఆతిథ్య అవకాశం హైదరాబాద్‌కు కల్పించాలని స్పోర్ట్స్ హబ్ బోర్డు తీర్మానం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, క్రీడా ప్రాధికార సంస్థ చైర్మెన్ శివసేనా రెడ్డి, స్పోర్ట్స్ హబ్ బోర్డు చైర్మెన్ సంజీవ్ గోయెంకా, కో చైర్మెన్ ఉపాసన కొణిదెల, సభ్యులు కపిల్‌దేవ్, అభినవ్ బింద్రా, పుల్లెల గోపీచంద్, బైచుంగ్ భూటియా, రవికాంత్ రెడ్డి, వీతా దానీ, పాపారావు, శశిధర్‌లు సమావేశంలో పాల్గొన్నారు.

**స్పోర్ట్స్‌కు హైదరాబాద్ వేదిక కావాలి**

తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తొలి సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన విజన్‌ను సభ్యులతో పంచుకున్నారు. 'జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా విధానంలో అందరూ హైదరాబాద్‌ను మోడల్‌గా చర్చించుకోవాలని నా లక్ష్యం. క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదికగా మారాలి. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. గతంలో పోల్చితే స్పోర్ట్స్ బడ్జెట్‌ను 16 రెట్లు పెంచాం. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులకు ఆర్థిక ప్రోత్సాహకాలు, ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నాం. క్రీడా రంగం ప్రాధాన్యతను పెంచేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీని ఏర్పాటు చేస్తున్నాం. హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా స్టేడియాలు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఆశించిన ఫలితాలు రావటం లేదు. క్రీడా వనరులను సమగ్రంగా సద్వినియోగం చేసుకోవటం, క్రీడా రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు స్పోర్ట్స్ హబ్ బోర్డు కార్యాచరణ రూపొందించాలి. క్రీడా రంగం అభివృద్ధికి నిధులు, నిపుణులు, నిర్వహణ అవసరమైనందునే స్పోర్ట్స్ హబ్ బోర్డులో ప్రముఖ కార్పోరేట్లు, క్రీడాకారులు, స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్లకు చోటు కల్పించామని' సీఎం తెలిపారు.

**క్రీడా పోటీల విధానంలో మార్పు**

'నాణ్యమైన క్రీడాకారులను వెలికి తీసేందుకు ప్రస్తుత క్రీడా పోటీల విధానంలో మార్పు చేస్తున్నాం. గ్రామ, మండల, శాసనసభ నియోజకవర్గ స్థాయి పోటీలు తొలి దశలో నిర్వహించి.. శాసనసభ నియోజకవర్గ స్థాయిలో విజేతలకు పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహిస్తాం. ఆ తర్వాత, అంతిమంగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్ర జట్లను ఎంపిక చేస్తాం. క్రీడా సామాగ్రిపై ఉన్న పన్నుల తగ్గింపునకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతాం. మా స్థాయిలో అవసరమైన ప్రోత్సాహకాలు అందజేస్తాం. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీలో ఫిజియోథెరపీ సహా ఇతర క్రీడా సంబంధిత కోర్సులు ప్రవేశపెడతాం. స్టేడియాలు, అకాడమీలు పెద్ద సంఖ్యలో ఉన్నా కోచ్‌లు లేరు.

# విదేశీ విద్యార్థులకు ట్రంప్ మరో షాక్

అమెరికాలో చదువుకుంటున్న, ఉన్నత చదువుల కోసం ఆ దేశానికి వెళ్లే ప్రయత్నాల్లో ఉన్న విద్యార్థులకు ట్రంప్ సర్కారు మరో షాక్ ఇచ్చింది. ఇప్పటికే వీసాలపై పలు ఆంక్షలు అమలు చేస్తున్న అమెరికా.. తాజాగా మరో కీలక సవరణకు ప్రతిపాదనలు చేసింది. విదేశీ విద్యార్థులు తమ దేశంలో ఎక్కువ కాలం ఉండిపోకుండా కట్టడి చేసేందుకు ప్రయత్నం చేస్తోంది. విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు, మీడియా ప్రతినిధులకు జారీ చేసే వీసాలకు పరిమిత కాల గడువు విధిస్తూ ప్రతిపాదనలను సిద్ధం చేసింది. స్టూడెంట్ వీసాపై వచ్చిన వారు నాలుగేళ్లకు మించి అమెరికాలో ఉండకుండా నిబంధనలకు సవరణ చేయనుంది. ప్రస్తుతం ఎఫ్-1, జే%-%1 వీసాలకున్న 'డ్యూరేషన్ ఆఫ్ స్టే' వెసులుబాటును కుదించనున్నట్లు సమాచారం. ఈ వెసులుబాటు ప్రకారం.. విద్యార్థులు ఎంతకాలం చదవాలనుకుంటే అంతకాలం అమెరికాలో ఉండొచ్చు. ఈ ఫ్లెక్సిబుల్ స్టూడెంట్ వీసాలకు కూడా గడువు విధించేలా 'పరిమిత కాల నివాస అనుమతి'తో కూడిన వీసాలను మంజూరు చేయాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రతిపాదించింది. విదేశీ విద్యార్థులకు డ్యూరేషన్ ఆఫ్ స్టే వెసులుబాటు వల్ల భద్రతాపరమైన ఇబ్బందులు, అమెరికన్ల ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని పేర్కొంది. అందుకే కొన్ని రకాల వీసాదారుల నివాస అనుమతులపై పరిమితి తీసుకొస్తున్నామని తమ నోటీసుల్లో పేర్కొంది. ఈ ప్రతిపాదనలను ఫెడరల్ రిజిస్ట్రీలో పబ్లిష్ చేయనున్నారు. ఆ తర్వాత ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించి తుది నిర్ణయం తీసుకుంటారు. ప్రజాభిప్రాయ సేకరణను తప్పించి తక్షణమే అమలు చేసేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసే అవకాశమూ లేకపోలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మార్పులు అమలులోకి వస్తే ప్రస్తుతం అమెరికాలో చదువుకుంటున్న 3.3 లక్షల మంది భారతీయ విద్యార్థులపై అధిక ప్రభావం పడే అవకాశం ఉంది.

# భారీ వర్షాలతో అధికారుల అప్రమత్తం

**(మొదటి పేజీ తరువాయి)**
అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. సహాయక చర్యలకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. ప్రమాదకర హోర్డింగులు, కూలిన చెట్లను వెంటనే తొలగించాలన్నారు. మరోవైపు విద్యుత్ అధికారులతో ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ (ఏ÷ఎషషూశష శు ఔషపశస) -టె-లికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలతో విద్యుత్ సమస్యలు ఎక్కడెక్కడ తలెత్తాయని ఆయన ఆరా తీశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఒక-టె-ండు చోట్ల మినహా పెద్ద ఇబ్బందులు తలెత్తలేదని అధికారులు ఆయనకు తెలిపారు. ఉత్తరాంధ్రలో నీటి ప్రవాహం అధికంగా ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి తగిన జాగ్రత్త చర్యలు తీసుకుంటు-న్నట్లు- వెల్లడించారు. విద్యుత్ ప్రమాదాలు తలెత్తకుండా ప్రజల్ని అప్రమత్తం చేయాలని అధికారులకు గొట్టిపాటి సూచించారు. వినాయక విగ్రహాల తరలింపు సమయంలోనూ సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ కీలక ప్రకటన చేశారు. కృష్ణా నది వరద ప్రవాహం భారీగా పెరుగుతుందన్నారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద ఉధృతంగా వస్తోందని చెప్పారు. ప్రభావిత జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారాయన. కృష్ణానది పరీవాహక ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లంక గ్రామ ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. వినాయక నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారీ వరదలు వస్తున్న నేపథ్యంలో వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదని హెచ్చరించారు ప్రఖర్ జైన్.


# 75 ఏళ్లకు పదవీ విరమణ లేనే లేదు

**(మొదటి పేజీ తరువాయి)**ఇది అన్ని దేశాలలో జరుగుతోందని మోహన్ భగవత్ అన్నారు. సరైన వయస్సులో వివాహం చేసుకుని, ముగ్గురు పిల్లలను కనడం వల్ల తల్లిదండ్రులు, పిల్లలు ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు. ముగ్గురు తోబుట్టువులు ఉన్న ఇళ్లలోని పిల్లలు చక్కని నడవడిక నేర్చుకుంటారు. భవిష్యత్తులో వారి కుటుంబ జీవితంలో ఎటువంటి ఆటంకాలు ఉండవు. వైద్యులు చెప్పింది ఇదే... మన దేశ జనాభా 2.1 జనన రేటును సిఫార్సు చేస్తోంది. ప్రతి భారతీయ జంట, దేశ ప్రయోజనాల దృష్ట్యా ముగ్గురు పిల్లలను కనడానికి ప్రయత్నించాలని అయితే, దీనిలో ఒక ఆందోళనకరమైన అంశం ఉంది. జనాభా ఒక వరం కావచ్చు లేదా భారం కూడా కావచ్చు. అందరికీ ఆహారం పెట్టాలి. అందుకే జనాభా విధానం ఉంది. కావున, జనాభా నియంత్రణలో ఉండేలా చూసుకోవడానికి అదే సమయంలో తగినంతగా ఉండేలా చూసుకోవడానికి ప్రతి కుటుంబానికి ముగ్గురు పిల్లలు ఉండాలి. కానీ అంతకంటే ఎక్కువ మంది ఉండకూడదు. వారి పెంపకం సరిగ్గా ఉండేలా చూసుకోవడానికి ఇది అందరూ అంగీకరించాల్సిన విషయం అని అన్నారు.

# తక్షణ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి

**(మొదటి పేజీ తరువాయి)**
గురువారం నాడు ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయి పరిస్థితులను ఆర్ అండ్ బి శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల్లో పరిస్థితులపై సమీక్షించిన మంత్రి, కాజ్ వే లు, కల్వర్టులు, బ్రిడ్జిలు, కోతకు గురైన రోడ్ల వివరాలు అధికారులను అడిగితెలుసుకున్నారు. కామారెడ్డి, నిర్మల్ వద్ద వరద ప్రవాహానికి కఐ 44 పై రాకపోకలకు ఏర్పడిన అంతరాయం, ట్రాఫిక్ క్లియరెన్స్ పై మంత్రి ఆరా తీసి..
నేషనల్, స్టేట్ హైవేల స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు ఈ సీజన్ లో అధిక వర్షాల వల్ల పాడైన రోడ్లు, కల్వర్టుల, ముఖ్యంగా ఇంకా రెడ్ అలెర్ట్ ఉన్న జిల్లాల రోడ్ల వివరాలు అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రోడ్లు తెగిన చోట, కల్వర్టులు పొంగిపొర్లుతున్న చోట, వాగులు ఉదృతంగా ప్రవహించే మైనర్ బ్రిడ్జిల వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు- చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా చూడాలని, తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద వర్షాలు తగ్గుముఖం పట్టగానే తాత్కాలిక మరమ్మతులు చేపడతామన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు చేయాలని అధికారులకు సూచించారు. ప్రాణ నష్టం జరగకుండా పోలీస్, ఎలక్ట్రిసిటీ-, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. డైన రోడ్లు, వంతెనలకు సంబంధించి శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఆర్ అండ్ బి హెడ్ ఆఫీస్ లో కంట్రోల్ సెంటర్ కు వస్తున్న ఫిర్యాదులు, సమాచార వివరాలపై మంత్రి ఆరా తీయగా.. స్టేట్ రోడ్స్ సి.ఈ ఆధ్వర్యంలో షిఫ్టుకు నలుగురు చొప్పున 24 గంటలు మానిటరింగ్ చేస్తున్నట్లు- చెప్పారు. మంత్రి గత రివ్యూలో చెప్పిన ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 37 ఆర్ అండ్ బి డివిజన్ల నుండి వివరాలు సేకరణ చేస్తున్నామని, 24 గంటలు అలెర్ట్ గా ఉంటు-న్నామని స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ మంత్రికి తెలిపారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వచ్చిన వరద ప్రవాహాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు ఆర్ అండ్ బి పరిధిలోని 37డివిజన్లలో 794 చోట్ల సమస్యాత్మక రోడ్లు గుర్తించామని,అందులో 1039 కి.మీ రోడ్డు దెబ్బతిందని, 31 చోట్ల రోడ్డు తెగిపోతే వెంటనే 10 చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ చేశామని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఆర్ అండ్ బి) మంత్రికి వివరించారు. 356 చోట్లలో కాజ్ వే లు,కల్వర్టులు వరద ప్రవాహం ఉంటే అందులో 289 దారి మళ్లింపు చేసినట్లు- పేర్కొన్నారు. రాకపోకలకు ఇబ్బంది ఉన్న 305 ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన 236చోట్ల క్లియర్ చేశామని,మిగతా చోట్ల వేగంగా క్లియర్ చేస్తున్నామని అన్నారు. మొత్తంగా 206 చోట్ల సిడి వర్క్స్ దెబ్బతిన్నాయని, రోడ్లు, కాజ్ వే,మైనర్ బ్రిడ్జి లు, కల్వర్టులు తాత్కాలికంగా, శాశ్వతంగా పునరుద్ధరించాలని ప్రాథమికంగా గుర్తించినట్లు- పేర్కొన్నారు. తాత్కాలిక పునరుద్ధరణకు 53.76 కోట్లు- వరకు ఖర్చు అవుతుందని, శాశ్వత పునరుద్ధరణ కోసం 1157.46 కోట్లు- అవసరమవుతాయని అంచనా వేసినట్లు- పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆర్ అండ్ బి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన చర్యలు, క్షేత్ర స్థాయిలో చూపిన పని తీరును అభినందించిన మంత్రి, అలసత్వం వహించకుండా.. అదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.?? రాష్ట్ర స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఆర్ అండ్ బి ఇంజనీర్లు అధిక వర్షాలు ఉన్న ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేస్తూ..పరిస్థితులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని, ఏ రోజుకు ఆరోజు వివరాలు ఉదయం, సాయంత్రం తనకు రిపోర్ట్ చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

### ఇద్దరకి కారుణ్య నియామకాలు పత్రాలు అందించిన మంత్రి పొంగులేటి



హైదరాబాద్,ఆగస్ట్28: సమాచార పౌర సంబంధాల శాఖలో కారుణ్య నియామకాల క్రింద ఇద్దరికీ జూనియర్ అసిస్టెంట్ గా నియమక పత్రాలను రాష్ట్ర రెవిన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అందచేశారు. టి.రోహన్ కుమార్ కు రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. అదే విధంగా కుమారి ఎస్.ప్రియాంక కు జూనియర్ అసిస్టెంట్ గా పోస్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరికి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం సచివాలయంలో కారుణ్య నియామకాల పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్.ప్రియాంక పాల్గొన్నారు.

# మలయాళ స్వామి ఆశ్రమ నిర్వాహకుడు దయానందపై విచారణ జరపాలి

**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు డిమాండ్**

**ఆశ్రమ అక్రమాలపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి**

**శ్రీ మలయాళ స్వామి ఆశ్రమ ఆస్తులను కాపాడాలి**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):** పట్టణంలోని శ్రీ మలయాళ స్వామి ఆశ్రమ నిర్వాహకుడు దయానంద పై ప్రభుత్వం విచారణ జరపాలని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింలు డిమాండ్ చేశారు.గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ,మలయాళ స్వామి ఆశ్రమ నిర్వాహకుడు ఆశ్రమ ఆస్తులను పక్కదారి పట్టిస్తూ అనేక ఆస్తుల విషయంలో వివాదాస్పదంగా వ్యవహరిస్తున్నారని దీనిపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి స్పందించి తగు విచారణ జరపాలని ఆయన ఈ సందర్భంగా కోరుతున్నారు. దేవునిపల్లి గ్రామంలో 5 ఎకరాలకు పైగా ఆశ్రమ స్థలం దానంగా పొంది ఆ తరువాత ఒక సెటిల్మెంట్ ద్వారా ఇతరులకు విక్రయించిన స్వామీజీ మరో రెండు ఎకరాల భూమిని అతని భార్యపై పట్టా చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆశ్రమ ఆస్తులను ఇలా అక్రమంగా కుటుంబ సభ్యుల పేరిట చేయడం తగదని ఆయన ఈ సందర్భంగా విమర్శలు చేశారు.అదేవిధంగా పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న ఆశ్రమ ఆస్తి విషయంలో కూడా అక్రమాలు జరిగాయని,ఆశ్రమం హక్కులను కూడా మున్సిపాలిటీలో మార్చే క్రమంలో అప్పట్లో వివాదం కొనసాగిందని అయితే ఇది నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో మున్సిపాలిటీ అధికారులు నిలిపివేశారని ఇంకా ఆశ్రమ పురోగతి లేకుండా అనేక అవకతవకలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఎన్నో ఉన్నాయని,దీనిపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపి ఆధ్యాత్మికపరంగా ఆస్తులను కాపాడి భక్తుల మనోభావాలను దెబ్బతీయకూడదని పేర్కొన్నారు.భక్తుల ఆధ్యాత్మిక చింతన కోసం ఏర్పాటు చేయబడ్డ ఆస్తుల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా ఆశ్రమంలో అవకతవకలకు పాల్పడుతున్న స్వామి దయానంద పట్ల జిల్లా కలెక్టర్ స్వయంగా స్పందించాలని బక్కని కోరారు.గతంలో గ్రామ పెద్దల సమక్షంలో కూడా అనేక చర్చలు జరిగాయని అయితే ఇవి ఒక కులిక్కి రాలేదని అయినప్పటికీ దయానంద స్వామి లాంటివారు ఏం ఆశించి ఇలా చేస్తున్నారో అర్థం కావడం లేదని జాతికి దక్కాల్సిన ఆధ్యాత్మిక ఆస్తులు ఎవరికి వ్యక్తిగతంగా ఉండకూడదని అది సమాజానికి కేటాయించబడి ఉండాలని బక్కని నరసింహులు సూచించారు.దీనిపై అవసరమైతే ఆధ్యాత్మిక ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

# జర్నలిస్టు ఖాజా పాషా ("కేపీ") వాహనం ధ్వంసం కేసులో వీడిన మిస్టరీ..

**వివరాలు వెల్లడించిన షాద్ నగర్ సిఐ విజయకుమార్..**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):** సీనియర్ జర్నలిస్ట్, టిడబ్ల్యూజేఎఫ్ నేత ఎం.డి ఖాజా పాషా (కేపీ) మహీంద్రా తార్ వాహనం ధ్వంసం కేసులో పురోగతి లభించింది.గత కొన్ని రోజుల క్రితం అర్ధరాత్రి వాహన అద్దాలను ధ్వంసం చేసిన ఘటన పై రంగారెడ్డి జిల్లా, షాద్ నగర్ ప్రాంత జర్నలిస్టులతో పాటు స్థానిక రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక వేత్తలు తీవ్రంగా స్పందించారు. ఈ నేపథ్యంలో వాహనం ధ్వంసం పై కేసు నమోదు చేసుకున్న సీఐ విజయ్ కుమార్ పోలీసు సిబ్బందితో కలిసి ఈ వ్యవహారంలో ముమ్మర దర్యాప్తు చేశారు.జర్నలిస్ట్ కేపీ వాహనం ధ్వంసం కేసులో పలువురు అనుమానితులను రైతు కాలనీలో విచారించారు.ఈ నేపథ్యంలో రైతు కాలనికి చెందిన ఎం.డి ఖలీల్ వాహనం ధ్వంసం కేసులో ప్రధాన నిందితుడిగా పోలీసులు తేల్చారు. సాంకేతిక ఆధారాలు,సిసి టీవీ ఫుటేజ్ తదితర విషయాలను పరిగణలోకి తీసుకొని ఎండి ఖలీల్ పై కేసు నమోదు చేయడం జరిగిందని సిఐ విజయకుమార్ మీడియాకు గురువారం తెలిపారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానంగా ఇచ్చారు.ఇదిలా ఉండగా గతంలో జర్నలిస్టు కేపీపై ఖలీల్ కేసులు పెట్టారని ఆ కేసులు కూడా కోర్టులో కొట్టివేయడం జరిగిందని ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో కాలనీలో జర్నలిస్టు కేపీ మరొకరికి మధ్య వాగ్వాదం జరిగిన విషయాన్ని గుర్తించి వాహనాన్ని ధ్వంసం చేస్తే అతనిపైకి ఈ నేరం వస్తుందనే కుట్రతో వాహనాన్నీ ఖలీల్ కారు ధ్వంసం చేయడం జరిగిందని ఈ కేసులో తెలిసింది.విధ్వంసం వెనుక మరికొందరి హస్తం ఉండవచ్చని జర్నలిస్ట్ కేపీ పోలీసు శాఖకు వినతి చేయడంతో ఆ దిశలో కూడా కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.ఇదిలా ఉండగా జర్నలిస్ట్ కేపీని మీడియా వివరణ కోరగా గతంలో కొందరి ప్రోత్బలంతో తనపై తప్పుడు కేసులు తనపై నమోదు చేయడం జరిగిందని,ఇప్పుడు కొందరి ప్రోత్బలంతోనే తన వాహనంపై దాడి చేశారని అనుమానాలను ఆయన వ్యక్తం చేశారు.ఏది ఏమైనప్పటికీ జర్నలిస్ట్ కేపీ వాహనం ధ్వంసం కేసులో మిస్టరీ వీడినందుకు పోలీసులకు స్థానిక జర్నలిస్టులు ధన్యవాదాలు తెలిపారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇలాంటి సంఘటనలు పునరావృత్తం జరగకుండా చూసుకోవాలని కోరారు.

# లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ తో వ్యవసాయం సస్యశ్యామలం

**రిజర్వాయర్ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యేలు**

**పరిగిలో ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్,రామ్మోహన్ రెడ్డిల మీడియా సమావేశం**

**రూ.20వేల కోట్ల నిధులు కేటాయించేలా సీఎం రేవంత్ రెడ్డి చర్యలు**

**మన ప్రాంత ప్రయోజనాలకు న్యాయం చేస్తామని స్పష్టీకరణ**







**ప్రజావినికిడి,(షాద్ నగర్):** నియోజకవర్గంలోని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ కల త్వరలో సాకారం కానుందని,పట్టుపడితే విడవం..నీళ్లు వచ్చేదాకా ఊరుకోమని షాద్ నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిలు స్పష్టం చేశారు.గురువారం రంగారెడ్డి జిల్లా పరిగి నియోజకవర్గ కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ,ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్టును గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ఆందోళనలపై అక్రమ కేసులు పెట్టిందని విమర్శించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎం రేవంత్ రెడ్డి చొరవతో ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించిందని తెలిపారు.షాద్ నగర్ తో పాటు చేవెళ్ల,పరిగి,వికారాబాద్ నియోజక వర్గాల ఆయా ప్రాంతాలకు కూడా లాభం చేకూరుతుందని చెప్పారు.గతంలో తాను,పాలమూరు ఐక్యవేదిక కన్వీనర్ రాఘవులు చేసిన పోరాటం ఫలితమే ఇదని,రైతుల సాగునీటి సమస్య తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఉమ్మడి పాలమూరు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల రైతులు పొట్టగొట్టి పేర్లు ఊర్లు మార్చి ఈ ప్రాంతానికి రావలసిన నీటిని తమ ప్రాంతానికి తరలించాలని ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై బిఆర్ఎస్ పార్టీని నిలదీస్తాం అని హెచ్చరించారు. కొందుర్గు మండలం లక్ష్మీదేవి పల్లి వద్ద సాగునీటి ప్రాజెక్టు నిర్మిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని అన్నారు,పట్టుపడితే విడువం ఈ ప్రాంతానికి నీళ్లు వచ్చేదాకా పోరాడుతూనే ఉంటాం అని ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, రామ్మోహన్ రెడ్డిలు ధీమా వ్యక్తం చేశారు.రంగారెడ్డి జిల్లాకు సాగునీరు రాకుండా చేసిన నాయకులు ఎవరో జనాలకు తెలుసు అన్నారు.ఆనాడు నిస్వార్థంతో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ తెచ్చుకున్నది నీళ్లు నిధులు నియామకాల కోసమని అన్నారు.దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును గత పాలకులు పేరు మార్చి పాలమూరు రంగారెడ్డి తీసుకువచ్చారని అన్నారు.వాళ్లకు అధికారం ముఖ్యం మాకు ప్రజా శ్రేయస్సు ముఖ్యం అని స్పష్టం చేశారు.ప్రాణహిత చేవెళ్ల ద్వారా గోదావరి జలాలను అనుసంధానం చేసేలా కృషి చేస్తాం అన్నారు.అధికారులు నిష్ణాతులైన ఇంజనీర్ల సూచనలతో మంచి రిజర్వాయర్ నిర్మించేలా ఈ ప్రాంతానికి మేలు చేస్తామని స్పష్టం చేశారు.సొంత డిజైన్లతో కాళేశ్వరం కట్టి కూలేశ్వరంల మార్చారనీ అధికారం అడ్డుపెట్టుకొని వాళ్ల ప్రాంతానికి సాగునీరు తరలించకపోయారని ఆరోపించారు.ఉమ్మడి పాలమూరు రంగారెడ్డి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల కోసం 20వేల కోట్ల నిధులు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఎమ్మెల్యేల వెంట షాద్ నగర్ నాయకులు బాబర్ అలీఖాన్,మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, సీనియర్ నేత కృష్ణారెడ్డి, రాజు,చంద్రపాల్ రెడ్డి,దామోదర్ రెడ్డి,కే కే కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుని కృప ఉంటే మన ప్రయత్నాలన్నీ ఫలిస్తాయి..

**ప్రముఖ జర్నలిస్ట్ మాధవి..**

**తనూజ రెసిడెన్సీ లోజర్నలిస్ట్ మాధవి వెంకట పవన్ చౌదరి దంపతుల ఆధ్వర్యంలో...గణపయ్యకు విశేష పూజలు..**





**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):** ఎల్బీనగర్ నియోజకవర్గపరిధిలోని జెడ్పీరోడ్ సాయి తనూజ రెసిడెన్సీ లో బుధవారం రోజు గణపతి పూజలు గణంగా నిర్వహించారు. ప్రముఖ జర్నలిస్ట్ మాధవి వెంకట పవన్ చౌదరి,ఆధ్వర్యంలో ఆ గణనాధుని పూజలు చేసి గణపతిని ప్రసన్నం చేసుకున్నారు. పూజ అనంతరం జర్నలిస్ట్ మాధవి మాట్లాడుతూ, విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.ప్రజలు నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.ప్రతి కుటుంబం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని,ఆ గణనాథుడు అందరినీ అనుగ్రహించాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వాడవాడలా మండపాలను ఏర్పాటు చేసి, భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య గణేశుడిని పూజిస్తున్న భక్తులకు సకల శుభాలు కలగాలని వినాయకుడిని కోరుకుంటున్నట్లు ఆమె అన్నారు.ఈ పూజా కార్యక్రమంలో అపార్ట్మెంట్ సభ్యులంతా పాల్గొని గణాంగ నిర్వహించారు.

# బొజ్జ గణపయ్య మా నియోజకవర్గాన్ని చల్లగా చూడవయ్యా

**జిహెచ్ఆర్ కాలనీలోని గణ నాథుడికి ప్రత్యేక పూజలు**

**ప్రత్యేక పూజల్లో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**తొలి పూజల విఘ్న వినాయక, ఓ బుజ్జి గణపయ్య మా నియోజకవర్గాన్ని చల్లగా చూడవయ్యా అంటూ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గణనాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ 9వార్డు జి హెచ్ ఆర్ కాలనీ పార్కు లో గణనాథుని వద్ద షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బాబర్ అలీ ఖాన్,అగ్గనూర్ బస్వం,చెంది తిరుపతి రెడ్డి,కృష్ణ రెడ్డి,దామోదర రెడ్డి,జంగారి రవి, కాలనీ వాసులు మాణిక్యం,సంజీవ్ రెడ్డి,శ్రీనివాస్, అశోక్,శ్రీనివాస్ రెడ్డి వెంకట కృష్ణ రెడ్డి,రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనాల నేపథ్యంలో షాద్ నగర్ లో చెరువుల పరిశీలన

**శంషాబాద్ డిసిపి రాజేష్ ఆధ్వర్యంలో స్థానిక అధికారులు పర్యటన**

**షాద్ నగర్ ప్రాంతాల్లో మూడు చెరువులను పరిశీలించిన పోలీసు అధికారులు**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**వినాయక చవితి నవరాత్రులలో నేపథ్యంలో ఆయన చెరువుల్లో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను సురక్షితంగా ఏర్పాటు చేసేందుకు షాద్ నగర్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో శంషాబాద్ డిసిపి రాజేష్,షాద్ నగర్ ఏసిపి ఎస్ లక్ష్మీనారాయణ,పట్టణ సిఐ విజయ్ కుమార్ తదితరులు పలు చెరువులను సందర్శించారు. నవరాత్రుల ముగింపు అనంతరం ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయకులను నిర్వాహకులు ఆయా ప్రాంతాల వారిగా చెరువులను విభజించి వాటిని నిమజ్జనం చేసే విధంగా ఏర్పాట్లు చేసేందుకు అధికారులు రూట్ మ్యాప్ నిర్ధారిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఇలాంటి అవచనియ సంఘటనలు అదేవిధంగా చెరువులలో సమృద్ధిగా నీరు ఉండడంతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నిమజ్జనానికి అనువుగా ఉన్న చెరువులను డిసిపి రాజేష్ పరిశీలించారని స్థానిక సీఐ విజయకుమార్ తెలిపారు.ఈ సందర్భంగా పోలీసు శాఖ పరిధిలోని ఫరూక్ నగర్ లోని బొబ్బిలి చెరువు,దూసకల్, బుచ్చిగూడా చెరువులని పోలీసు అధికారులు సందర్శించారు.ఈ కార్యక్రమంలో షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్,మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి,విద్యుత్ శాఖ అధికారులు,కాంగ్రెస్ నాయకులు పులిమామిడి శ్రీశైలం గౌడ్ తదితరులు వారి వెంట ఉన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవ ఉత్సవ కమిటీ సమావేశం

**అమరులైన సమరయోధుల చరిత్రను తెలియపరుస్తాం**

**ముఖ్య అతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):** హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవ ఉత్సవ కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి కమిటీ ఛైర్మన్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి అధ్యక్షత వహించగా,ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి,నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,ఎమ్మెల్సీ మాల్క కొమరయ్య,మధుసూదన్ రెడ్డి,విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మాట్లాడుతూ, నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడి అమరులైన సమరయోధుల చరిత్రను ప్రజలకు చేరవేయడానికి బీజేపీ సిద్ధమవుతోందని అన్నారు.17 సెప్టెంబర్‌ను విమోచన దినోత్సవంగా అధికారికంగా జరపాలని బీజేపీ 1998 నుండే నిరంతరం పోరాటం చేస్తున్నదని గుర్తు చేశారు. తెలంగాణ విమోచన పోరాట చరిత్రను విద్యార్థులకు పాఠ్యాంశంగా చేయాలని, రజాకారుల దారుణాలకు ఎదురు నిలిచిన తెలంగాణ వీరుల త్యాగాలను కొత్త తరాలు తెలుసుకోవాలని పేర్కొన్నారు.అలాగే,తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత గత ప్రభుత్వం ఎంఐఎం పార్టీ ఒత్తిడికి భయపడి ఈ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేదని,ఇప్పటి ప్రభుత్వం కూడా "జాతీయ సంఖ్యత దినోత్సవం" పేరుతో నిజమైన చరిత్రను వక్రీకరించిందని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరపకపోయినా,ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 2023లో ఈ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించి,కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తోందని ఆయన గుర్తు చేశారు.

## సంకల్ప యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపయ్యకు విశేష పూజలు..



**ప్రజావినికిడి,(నాగోల్):**నాగోల్ డివిజన్ పరిధిలో నిసంకల్ప యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితికి పూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హిందువులు ఏ కార్యక్రమాన్ని ప్రారంభించినా లేదా పూజలు,నోములు, వ్రతాలు చేసినా ఎటువంటి విఘ్నాలు, ఆటంకాలు లేకుండా అవి కొనసాగాలని తొలి పూజను గణనాధునికే చేస్తారు. ఆ పార్వతీ తనయుడు అనుగ్రహం పొందితే అన్ని కార్యాలు జయమవుతాయని భారతీయుల ప్రగాఢ నమ్మకం.భాద్రపద శుక్లపక్ష చవితి రోజునే వినాయకుడి జననం జరిగిందని, గణాధిపత్యం వచ్చిందనే పలు కథలు ప్రచారంలో ఉన్నాయి. అయితే, విఘ్నాధిపతిగా గణనాథుడు పూజలు అందుకుంటున్నాడు. ఈ విన్నాయక చవితి పండుగను కుల మతా, జాతలకు అతీతంగానూ జరుపుకోవడం మరో విశేషం..అని వారు ఈ సందర్భంగా అన్నారు.

## నాగోల్ లోని శ్రీ హనుమాన్ నగర్ కాలనీ లో వినాయక నవరాత్రుల పూజలు.



**ప్రజావినికిడి,(నాగోల్):** వినాయక చవితిని పురస్కరించుకునివిగ్రహ దాతలు పైళ్ల యాది రెడ్డి,పైళ్ల లక్ష్మమ్మ కొడుకులు వై.చంద్ర శేఖర్ అధ్యక్షుడు శ్రీ హనుమాన్ నగర్ కాలనీ,నాగోల్ వారి ఆధ్వర్యంలో ఘనంగా వినాయక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులుఈ ప్రాంత ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అన్నారు.

## ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్ధండి మరియు ఫకీర్ కొండాపూర్ గ్రామల్లో పర్యటించిన కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్..

**ఇబ్రహీంపట్నం, ప్రజావినికిడి,**భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కోరుట్ల నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండగలరని తెలిపారు..పాత శిథిలావస్థ ఇండ్లలో ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని ఏదైనా అవసరం ఉంటే నాకు కాల్ చేయగలరని తెలిపారు..మీ మండల రెవెన్యూ అధికారి కార్యాలయాన్ని సంప్రదించగలరు వారు పునరావాస కేంద్రాన్ని తగిన సమయంలో ఏర్పాటు చేసి మీకు కావలసిన సౌకర్యాలను కల్పిస్తారని..ఎర్ధండి గోదావరి ఎక్కువగా ప్రవహిస్తునందువల్ల రైతులు వాగులు, వంకలు చెరువులు మరియు గోదావరి పరిసరాలకు దూరంగా ఉండలని వర్షాలు తగ్గే వరకు మోటార్ల వద్దకు వెళ్లకుండా ఉండడం మంచిదని తెలిపారు..వినాయక మండపాల వద్ద మండలి సభ్యులు, యువకులు,భక్తులు విద్యుత్ వైర్లతో జాగ్రత్తగా ఉండగలరని తెలిపారు..

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ

**భారీ వర్షాల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు**

**నియోజకవర్గంలోని పలు ఆరోగ్య ఉప కేంద్రాలను పరిశీలించిన డీఎంహెచ్వో**

**ఆరోగ్య పరీక్షలు ప్రభుత్వ హెల్త్ సెంటర్ లోనే చేయించుకోండి**

**దోమల నివారణకు దోమతెరలు మస్కిటో కాయిల్స్ ఉపయోగించండి**

**పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఎక్కడ నీరు నిలవకుండా చూసుకోవాలి**

**ప్రైవేట్ హాస్పిటల్ లను ఆశ్రయించి అప్పుల పాలు కావద్దు ఇల్లు గుల్ల చేసుకోవద్దు..డిఎం హెచ్ ఓ**

**ప్రైవేట్ హాస్పిటల్లు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు**

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత లేదు.**

**మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ హాస్పిటల్లకు సంప్రదించండి**

**షాద్ నగర్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన-డి ఎం హెచ్ ఓ వెంకటేశ్వర్లు**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డిఎమ్.హెచ్(డి ఎం హెచ్ ఓ) వెంకటేశ్వర్లు..గురువారం షాద్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు పెరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.సీజనల్ వ్యాధుల ముందస్తు కేసులను గుర్తించడానికి మరియు ప్రజలకు అవగాహన కల్పించడానికి అంతటా ఇంటింటి సర్వేలు ప్రారంభిస్తామని చెప్పారు.వైద్యం కోసం వచ్చే రోగులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.భారీ వర్షాల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ఆరోగ్య శాఖను అప్రమత్తం చేయడం జరిగిందని అన్నారు.రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా ఈగలు దోమల వల్ల మలేరియా, డెంగ్యూ,టైఫాయిడ్ వంటి విషపూరిత జ్వరాలు వస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య శాఖ పరిధిలో అందరికీ సెలవులు రద్దు చేయడం జరిగిందని తెలియజేశారు. ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఎక్కడ మందుల కొరత లేకుండా అన్ని సెంటర్లలో మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నామని అన్నారు.ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు పరిసరాల్లో ఎక్కడ నీరు నిలవకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.ప్రతి గ్రామంలో పంచాయతీల సమన్వయంతో ఆరోగ్య కార్యకర్తలు పనిచేసేలా చూసుకుంటున్నామని 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఆరోగ్య కార్యకర్తలు ఉంటారని అన్నారు. ముఖ్యంగా పసిపిల్లలు,గర్భిణీలు, వృద్ధులు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.




ముఖ్యంగా ప్రైవేట్ హాస్పిటల్స్ కు వెళ్లకూడదని ప్రభుత్వ హాస్పిటల్లో అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని అన్నారు.ప్రైవేట్ హాస్పటలను సంప్రదించి అప్పుల పాలు కావద్దని ఇల్లు గుల్ల చేసుకోవద్దని కోరారు.ఈ ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యం వారు ఐ జి జి, ఐ జి ఎం,ఎలిసా పరీక్షలు చేయించుకున్న తర్వాత అందులో పాజిటివ్ అని నిర్ధారణ అయితేనే డెంగ్యూ కేసుగా వ్యవహరించాలని రక్తంలో ప్లేట్లెట్స్ తగ్గినంతమాత్రాన డెంగ్యూ కేసులుగా చూడొద్దని కోరారు.ప్రతి ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రంలో ఉచిత టెస్టులు చేయించుకొని వ్యాధిని నిర్ధారించుకోవాలని అన్నారు.ఆర్ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేయకూడదని అలా చేసే కఠినమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో షాద్ నగర్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి, హాస్పిటల్ సూపరింటెండెంట్ విష్ణువర్ధన్,హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ లోళ్ళ గల్లీలో పెద్దమ్మల కుటుంబాలకు సర్వే చేయించిన ఇబ్రహీంపట్నం తహసిల్దారు

**ప్రజావినికిడి,(ఇబ్రహీంపట్నం):**
ఆగస్టు28,నాడు తెలంగాణ సెంచర జాతుల మహిళ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కోట అనిత ఎల్లమ్మ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలంలోని పోచమ్మల గల్లీలో నివసిస్తున్న సంచార0 జాతి అయిన పెద్దమ్మల బాండ్ల ప్రజల ఇంటి పట్టాలు అలాగే ఇంటి నిర్మాణం గురించి గత రెండు నెలల నుండి జగిత్యాల కలెక్టర్ కు ఆర్డిఓ అలాగే ఎమ్మార్వో కు వినతి పత్రాలు ఇవ్వడం జరుగుతుంది ఈ వినతి పత్రాలు ఇవ్వడానికి సహకరించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా లేబర్ కమిషనర్ కోళ్ల ప్రసాద్ బిసి వెల్ఫేర్ సునీత ఇబ్రహీంపట్నం తహసిల్దారు గారు ప్రొఫెసర్ తిరుమలి తెలంగాణ సంచార జాతి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నరేందర్ కార్యదర్శి సింగి జోబు శ్రీనివాస్ శ్యామల యాదగిరి నిరంతర సహకారంతో వివిధ ఆఫీసులకు పెద్దమ్మల ప్రజల గోస గురించి వివరించడం జరిగినది దీని ఫలితంగా



గురువారం రోజు ఇబ్రహీంపట్నం తహసిల్దార్ బివిఎస్-ఎస్ వరప్రసాద్ ఆదేశాలతో జూనియర్ అసిస్టెంట్ ఏం ప్రశాంత్ అదేవిధంగా ఎండి సాదుల్ల పోచమ్మల గల్లి లో డేరల కింద నివసిస్తున్న పెద్దమ్మల 19 కుటుంబాలను కుటుంబ సర్వే అలాగే వీరు నివసిస్తున్న ప్రతి డేరాను సందర్శించారు.ఏం ప్రశాంత్ పెద్దమ్మల ప్రజలకు మేము మీరు జీవిస్తున్న అతి దుర్భరమైన జీవనం గురించి పాములు తేళ్లు ఇంకా జీవరాసులతో మీ ప్రాణాల కోసం పోరాడుతున్న విషయం గురించి నా యొక్క రిపోర్టులో రాసి నాపై అధికారికి పెను వెంటనే అందజేస్తానని మీకు తగు న్యాయం జరిగే విధంగా నా వంతుగా కృషి చేస్తానని ప్రజలకు సూచించారు.కోట అనిత ఎల్లమ్మ మాట్లాడుతూ,మా ఆడవారు రెండు కిలోమీటర్ల దూరం వరకు బాత్రూంకు వెళ్తారు మా పిల్లలకు రక్షణ లేదు దయచేసి మా ప్రజలకు సొంత ఇంటిలో జీవించే విధంగా మా ప్రాణాలను రక్షించుకునే విధంగా వెంటనే మా స్థలాలకు పట్టాలు మరియు ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని ప్రజల తరపున సర్వే చేసిన అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఏం సూరయ్య జిల్లా నాయకుడు మారిన్న డి.బొర్రయ్య ఆర్ ఎర్రన్న పోశయ్య డి.లక్ష్మి ఇరుణాల సాయిలు గంగు పోసాని రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా గణేశునికి పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..



**ప్రజావినికిడి,(మహేశ్వరం):**మహేశ్వరం నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో ప్రతిష్టించిన వినాయకునికి ఘనంగా పూజలు నిర్వహించిన మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి.అనంతరం నియోజకవర్గంలోని బాలాపూర్,బడంగ్ పేట్ పలు గ్రామాల్లో ప్రతిష్టించిన వినాయక మండపాల దగ్గర ఆమె బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పటోళ్ల కౌశిక్ రెడ్డి,ముఖ్య నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జిల్లల్ గూడ గ్రామపంచాయతీ ఆవరణం లో ప్రతిష్ఠించిన వినాయకుని మొదటి రోజు సందర్భంగా ఆమె మీర్ పేట్ బీఆర్ఎస్ అధ్యక్షులు అర్కకాల కామేష్ రెడ్డి తో కలిసి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయ గణపతి ఆశీస్సులతో ప్రజలందరి విఘ్నాలు తొలిగి విజయం చేకూరాలని,గణనాథుడి సాక్షిగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆమె భగవంతుని కోరుకున్నారు. అనంతరం అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## రవి ఆధ్వర్యంలో ఘనంగా వినాయకుని పూజలు



**ప్రజావినికిడి,(అంబర్ పేట్):**
హైదరాబాద్ అంబర్పేట్ నియోజక వర్గం గోల్నాక డివిజన్ తులసి రామ్ నగర్ లంకలో రవి ఆధ్వర్యంలో ఘనంగా వినాయకుని పూజలు నిర్వహించారు.పూజా కార్యక్రమంలో మొదటి రోజు దంపతులు, కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా పూజలు చేశారు. వినాయకుడికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు.ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ,ప్రతి సంవత్సరం ఇక్కడ కాలనీ ప్రాంత క్షేమం కోసం వినాయకుని ప్రతిష్టాపన చేసి పూజలు చేయడం జరుగుతుందన్నారు. ఇక్కడ తమ కాలనీవాసులు ప్రతి ఇంటి నుండి రోజు ఒకరు చొప్పున స్వామివారికి పూజలు జరిపించడం జరుగుతుందని తెలిపారు.అందరూ గణపతి అనుగ్రహం వల్ల క్షేమంగా ఉండాలని,అందరూ ఆరోగ్యవంతులుగా వర్ధిల్లాలని కోరారు. పూజా కార్యక్రమంలోబద్రి,రామకృష్ణ, సోనూ,రాజు,వినయ్, మహేష్, లక్ష్మణ్, యోగేష్,సునీల్, ఉమాకాంత్,కరణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థలకు సెలవులు ప్రకటన



హైదరాబాద్,**ఆగస్టు 28ప్రజావినికిడి,** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో 13 జిల్లాల్లో పాఠశాలలకు విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. నల్లగొండ, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, సిద్ది పేట, జగిత్యాల, సిరిసిల్ల,కామారెడ్డి, మెదక్, నిర్మల్, ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు- విద్యాసంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయకు రాకూడదని అధికారులు సూచించారు. వర్ష ప్రభావం కారణంగా కామారెడ్డి జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు ఆగస్టు 29, 30 వరకు సెలవులు ప్రకటించినట్లు- ప్రభుత్వం తెలిపింది. భారీ వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సెలవులను మరో రెండు రోజులు పొడిగించింది. అందువల్ల పాఠశాలలు, కళాశాలలు బంద్ కానున్నాయి.సిద్దిపేట జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల ప్రభావంతో కామారెడ్డి, మెదక్ జిల్లాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

# ఖమ్మంలో పొంగుతున్న వాగులు

ఖమ్మం,**ఆగస్టు 28ప్రజావినికిడి,,** ఖమ్మం జిల్లా కొణిజర్లలో భారీ వర్షం కురిసింది. ఈ ప్రభావంతో పగిడేరు, నిమ్మవాగు, జన్నారం ఏరు, రాళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొణిజర్ల, మల్లుపల్లి మధ్య రోడ్డు పైనుంచి పగిడేరు ప్రవహిస్తుండటంతో కొణిజర్ల, ఏన్కూరు మండలాల రాకపోకలు నిలిచిపోయాయి. కొణిజర్ల, పెద్దమునగాల, పెద్దగోపతి, గుబ్బగుర్తి చెరువులు అలుగు పారుతున్నాయి. వాగుల ఉధృతితో ఆ పరిసర ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. తీవ్రంగా నష్టపోయినట్లు- రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొణిజర్ల మండలంలో 120 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు- అధికారులు వెల్లడించారు.

-------------------

# ఎన్‌హెచ్ 44పై రాకపోకలపై ఆంక్షలు

## భారీ వర్షలతో పలుచోట్ల కొట్టుకుపోయిన రోడ్డు

## వాహనాలను దారి మళ్లించినట్లు ట్రిఫిక్ డిసిపి వెల్లడి

హైదరాబాద్**ఆగస్టు 28ప్రజావినికిడి,** తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో పలుచోట్ల 44వ నంబర్ జాతీయ రహదారి దెబ్బతింది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుండటంతో అధికారులు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి ఎన్‌హెచ్ 44 వైపు వెళ్లే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు- సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావ్ భూపాల్ తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న వాహనాలను మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద మళ్లిస్తున్నట్లు- పేర్కొన్నారు. మేడ్చల్ చెక్‌పోస్ట్, సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్ మీదుగా ఆదిలాబాద్ వెళ్లాలని గజరావ్ భూపాల్ సూచించారు. పోలీసులకు ప్రయాణికులు సహకరించాలని ఆయన కోరారు. దూరప్రాంతాలకు వెళ్లే వారు ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు మళ్లింపు మార్గాలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. ప్రయాణికులకు సహాయం కోసం ట్రాఫిక్ పోలీసులు, హైవే పెట్రోలింగ్ బృందాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. భారీ వర్షాలతో కామారెడ్డి సమీపంలో 44వ జాతీయ రహదారి ధ్వంసమైందని.. దీంతో 25 శాతం రాకపోకలు మాత్రమే జరుగుతున్నట్లు- ఆ జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వాహనదారులు మేడ్చల్-రామాయంపేట్-కామారెడ్డి-డిచ్‌పల్లి మార్గంలో కాకుండా ప్రత్యామ్నాయ దారుల్లో రాకపోకలు సాగించాలని సూచించారు. భారీ వాహనాలను మేడ్చల్ వద్ద.. సాధారణ వాహనాలను రామాయంపేట వద్ద మళ్లిస్తున్నట్లు- తెలిపారు. ప్రజలు దీన్ని గమనించాలని కోరారు.

ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ మార్గంలో వెళ్లే వాహనదారులకు నిర్మల్ పోలీసులు పలు సూచనలు చేశారు. ఆదిలాబాద్ నుంచి కామారెడ్డి మీదుగా హైదరాబాద్ వెళ్లే వాహనదారులు నిర్మల్ సమీపంలోని కొండాపూర్ బ్రిడ్జి నుంచి ఎడమవైపునకు తిరిగి డైవర్షన్ మార్చుకుని వెళ్లాలని సూచించారు. కొండాపూర్ నుంచి మామడ, ఖానాపూర్‌మెట్, జగిత్యాల, కరీంనగర్ మీదుగా హైదరాబాద్ వెళ్లాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు.

---------------

# పలురైళ్లు రద్దు..పలు దారిమళ్లింపు

హైదరాబాద్,**ఆగస్టు 28ప్రజావినికిడి,** తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. దీంతో పాటు- కొన్ని రైళ్లు దారి మళ్లించినట్లు-, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేసినట్లు- దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. 36 రైళ్లు రద్దు, 25 రైళ్లు దారి మళ్లింపు, 14 రైళ్లను పాక్షిక్షంగా రద్దు చేసినట్లు- ఆయన వివరించారు. కామారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల రైలు మార్గంలో వరద నీరు ముంచెత్తింది. దీంతో రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

----------

## కామారెడ్డి జిల్లాలో పలు రోడ్లు ధ్వంసం

## బీబీపేట-కామారెడ్డి వంతెన ధ్వంసం

కామారెడ్డి,ఆగస్టు 28(ఆర్ఎన్ఎ): కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. కుంభవృష్టి ధాటికి పలుచోట్ల జనజీవనం స్తంభించిపోయింది. చాలా ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. బీబీపేట నుంచి కామారెడ్డి వెళ్లే మార్గంలో వరద నీటి దాటికి వంతెన కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు క్యాసంపల్లి శివారులో వరద తీవ్రతకు జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో నిజామాబాద్ వైపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. క్యాసంపల్లి శివారులో హైవేపై ఏర్పడిన గుంత కారణంగా రోడ్డు ధ్వంసమైంది. మెదక్-బోధన్ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. పోచారం జలాశయానికి భారీగా వరద పో-టె-త్తడంతో మెదక్, బోధన్ ప్రధాన రహదారిపై హై లెవల్ వంతెన కొట్టు-కుపోయింది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇరువైపులా వాహనాలు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. మరో మార్గం నుంచి వాహనాలు ప్రయాణించే విధంగా అధికారులు ఏర్పాట్లు- చేశారు.

----------

# నిండుకుండలా మానేరు జలాశయం

## మిడ్‌మానేరులోకి భారీగా వరదనీరు

కరీంనగర్,**ఆగస్టు 28ప్రజావినికిడి,** ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో మానేరు వాగు ఉగ్రరూపం దాల్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నర్మాల వద్ద ఎగువ మానేరు జలాశయం నిండుకుండను తలపిస్తోంది. దీంతో దిగువకు వరద నీటిని విడుదల చేశారు. మరోవైపు మిడ్ మానేరులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మధ్య మానేరు 17 గేట్ల నుంచి 33 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ మేరకు వాతావరణశాఖ వెల్లడించింది. సిద్దిపేట, మెదక్, జనగామ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

# రాష్ట్రంలో భారీ వర్షాలు ,వరద పరిస్థితులపై నిరంతర సమీక్ష

## భారీగా నష్టపోయిన జిల్లాకు అదనంగా నిధులు

## యుద్ధ ప్రాతిపదికన రవాణా సౌకర్యం పునరుద్ధరణ

## శవాలపై చిల్లర ఏరుకొనేలా బిఆర్ఎస్ వ్యవహారం

## రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, హౌసింగ్,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..



**ప్రజావినికిడి,(హైదరాబాద్):** రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు,వరద పరిస్థితులు,సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, హౌసింగ్,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొద్ది సమయంలోనే ముఖ్యంగా మెదక్, కామారెడ్డి ఆదిలాబాద్ జిల్లాల్లో కనీవినీ ఎరుగని రీతిలో వర్షపాతం నమోదైందన్నారు. అయినా కూడా ప్రాణ నష్టం,ఆస్తినష్టం వీలైనంత మేరకు తగ్గించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బుధవారం మధ్యహ్నం నుంచే పరిస్థితిని సమీక్షించామని వెల్లడించారు.వరదల్లో చిక్కుకున్నవారికి డ్రోన్ల ద్వారా ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. సిరిసిల్ల జిల్లాలోని నర్మల గ్రామం వద్ద బుధవారం నాడు మానేరు వాగు వరదల్లో చిక్కుకున్న ఐదుగురిని హెలికాప్టర్ ద్వారా రక్షించామని తెలిపారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు వారం రోజుల క్రితమే కోటి రూపాయిల చొప్పున నిధులు విడుదల చేశామని,ప్రస్తుతం అతి భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న జిల్లాలకు అదనంగా ఎన్ని నిధులైనా మంజూరు చేస్తామని తెలిపారు.

భారీ వర్షాలతో స్ధంభించిన జాతీయ రహదారితోపాటు పంచాయితీరాజ్,ఆర్ %డ%బీ రోడ్లను క్లియర్ చేశామని,దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన తాత్కాలికంగా పునరుద్ధరిస్తున్నామని తెలిపారు.పలు మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు రహదారి సౌకర్యాలు దెబ్బతిన్నాయని వీటిని వెంటనే పునరుద్ధరించేలా ఆదేశించామన్నారు. జిల్లాల్లో రెవెన్యూ. పోలీసు యంత్రాంగం చిత్తశుద్ధితో 24%శ%7 పనిచేస్తున్నాయని తెలిపారు.గురువారం నాడు విపత్తుల నిర్వహణా శాఖ అధికారులతో మంత్రిగారు సమీక్షించారు.అలాగే మెదక్ కామారెడ్డి సిరిసిల్ల నిర్మల్ జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

వర్షాలు వరదలపై ఆయా జిల్లాల యంత్రాంగంతో నిరంతరం మానిటరింగ్ చేసుకోవాలని సూచించారు.వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు. వర్షాలతో చనిపోయిన వారి కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు.రాష్ట్రంలో వర్ష బీభత్సం దృష్ట్యా ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు పని చేస్తున్నాయని, అవసరాన్ని బట్టి హెలికాప్టర్ల ద్వారా బాధితులను ఆదుకోవడానికి సిద్ధం చేశామని వివరించారు. కూలి పోయిన ఇండ్లు, నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మంత్రి ప్రకటించారు.

ఒక్క మెదక్,సంగారెడ్డి జిల్లాల్లో కేవలం ఒక గంట వ్యవధిలో 700 మిల్లీమీటర్ల వర్షం కారణంగా నీటి వనరులు పూర్తిగా నిండిపోయాయని, వాటని నుంచి ఉధృతంగా నీరు బయటకు వెళ్లడంతో గట్లు దెబ్బతిని తీవ్ర నష్టాన్ని కలిగించిందని వివరించారు.మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని తండాలు మరీ ఎక్కువగా వర్ష బీభత్సానికి గురయ్యాయని,ఈ తండాలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను వీలైనంత త్వరగా కల్పించేలా అధికారులను ఆదేశించామన్నారు. వర్షాల తర్వాత వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖకు సూచించామన్నారు.

రాష్ట్రంలో ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. ప్రతిపక్షమైన బి.ఆర్. ఎస్ రాజకీయ లబ్ధికోసం మాట్లాడడం సరికాదన్నారు. వారి పాలనలో వరదలొస్తే నాడు ఏం చేశారో.. నేడు ఏం జరుగుతుందో కళ్లకు కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని అన్నారు.శవాల మీద చిల్లర ఏరుకునే వ్యవహారం చేయవద్దని, ఉపయుక్తమైన సలహాలు ఇస్తే స్వీకరించేందుకు సిద్దంగా ఉన్నామని తెలిపారు.

# కాకతీయ లో పరీక్షలు వాయిదా

## డిగ్రీ, పిజి పరీక్షలు వాయిదా వేస్తూ ప్రకటన




వరంగల్,**ఆగస్టు 28ప్రజావినికిడి,** పలు జిల్లాల్లో ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టు 28, 29 తేదీల్లో జరగాల్సిన డిగ్రీ, పీజీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాజేందర్ ప్రకటించారు. వర్షాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, మిగిలిన పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. వాయిదా వేసిన పరీక్షల కొత్త తేదీలను త్వరలో ప్రకటిస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా, కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గురువారం జరగాల్సిన బీఎడ్, ఎంఎడ్ పరీక్షలు కూడా వాయిదా పడ్డాయి. వర్షాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. మిగతా పరీక్షలు యథావిధిగా జరుగుతాయని స్పష్టంచేశారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మోడల్ స్కూల్స్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి ఆరు నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షలు నిర్వహించినా, ఇంకా సుమారు 48,630 సీట్లు- ఖాళీగా ఉన్నట్లు- గుర్తించామని ఆయన వెల్లడించారు.ఇంటర్ రెండో సంవత్సరం 13,256 సీట్లు-, ఇంటర్ ఫస్ట్ ఇయర్ 12,668 సీట్లు-, ఆరో తరగతి 7,543 సీట్లు-, ఏడో తరగతి 5,192 సీట్లు-, ఎనిమిదో తరగతి 3,936 సీట్లు-, తొమ్మిదో తరగతి 2,884 సీట్లు-, పదో తరగతి 3,151 సీట్లు- ఖాళీగా ఉన్నట్లు- వివరించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు నేరుగా సంబంధిత మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌ను సంప్రదించి అడ్మిషన్లు పొందవచ్చని సూచించారు.

# పురిటి నొప్పులతో నిండు గర్భిణి

## జేసీబీ సాయంతో ఒడ్డు దాటింపు...



**రాయికల్ ఆగస్టు 28ప్రజావినికిడి,** రాయికల్ మం. భూపతిపూర్ కు చెందిన లక్ష్మీ అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో రాయికల్ కు తీసుకెళ్తుండగా రామోజీపేట - భూపతి పూర్ మధ్య గల లో లెవల్ వంతెన పై భారీగా వరద నీరు రావడంతో స్థానికులు జేసీబీ సహాయంతో గర్భిణీ సురక్షితంగా లో లెవల్ వంతెన దాటించి 108 లో రాయికల్ కు తరలించారు.

# మెదక్ జిల్లాలోని రామాయంపేట లో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

## రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ నరసింహ







**సంగారెడ్డి ఆగస్టు 28ప్రజావినికిడి,** మెదక్ జిల్లాలోని రామాయంపేట లో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన. వరద బాధితులతో మాట్లాడారు . లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సహాయక చర్యలను చేపట్టాలని ఆదేశించారు . గత రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అతి భారీ వర్షాల వల్ల రామాయంపేట జలదిగ్బంధంలో చిక్కుకుందన్నారు . గత రెండు రోజుల నుండి భారీ వర్షాలలో చిక్కుకున్న 60 మందిని జిల్లా డిజాస్టర్ యంత్రాంగం ,రెవిన్యూ , పోలీసులు , వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కాపాడారన్నారు . ఇద్దరూ వ్యక్తులు గల్లంతయ్యారన్నారు . వరదల్లో కొట్టుకుపోయిన ఒకరి మృతదేహం లభించిందని మంత్రి వెల్లడించారు . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రభుత్వం పూర్తి అప్రమత్తతో ఉందన్నారు . జిల్లా కు చెందిన ప్రభుత్వ యంత్రాంగం ప్రజలను కాపాడే పనిలో నిమగ్నమై ఉన్నారన్నారు. వరద ప్రాంతాల్లో, లోతట్టు ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలపై జిల్లా కలెక్టర్, ఎస్పీ లతో మంత్రి టెలిఫోన్లో సమీక్షించారు. గత 50 ఏళ్ల లో ఇంతటి భారీ వర్షాలను చూడలేదని స్థానిక ప్రజలు మంత్రికి తెలిపారు. మెదక్ జిల్లాలోని రామాయంపేట లోని కామారెడ్డి రోడ్ లో ఉన్న బీసీ కాలనీ నీటి మునిగిన ఇండ్లను వరదని ఉద్రిత్తిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పరిశీలించారు. రామాయంపేటలోని వరద ప్రభావిత ప్రాంతాలను లోతట్టు ప్రాంతాలను మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు గారితో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి నిత్యవసర వస్తువులను భోజనాలను బట్టలను బెడ్ షీట్లను అందజేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. నిజాం పేట మల్క చెరువు , కోనాపూర్ , నందిగామ రోడ్డు లో దెబ్బ తిన్న బ్రిడ్జి , సాయి చెరువు అలుగు లను క్షేత్ర స్థాయిలో మంత్రి దామోదర్ రాజనర్సింహా పరిశీలించారు.

వచ్చే రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలు రెవిన్యూ ,పోలీస్ ,డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బందికి సహకరించాలని మంత్రి ప్రజలకు సూచించారు. భారీ వర్షాల కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సురక్షితమైన ప్రదేశాలలో ఉండాలని సూచించారు. దెబ్బతిన్న ఇండ్లు , పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లు పరిశీలించారు. ప్రభుత్వం పూర్తి అప్రమత్తతో ఉందన్నారు జననష్టం జరగకుండా నష్ట నివారణ చర్యలను చేపడుతున్నామన్నారు .దెబ్బతిన్న రోడ్లను త్వరలో పునరుద్ధరిస్తామన్నారు. పంట నష్టం .ఆస్తి నష్టం అంశాలను రెవిన్యూ యత్రాంగం అంచనా లు రూపొందిస్తున్నారన్నారు . గత 50 ఏళ్ల చరిత్రలో ఇంతటి వర్షం కురవలేదన్నారు . రామాయంపేట , కామారెడ్డి, మెదక్ లలోని కొన్ని మండలాలలో, ప్రాంతాలలో సుమారు 200 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదయింద అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని మంత్రి వెల్లడించారు. ప్రజలకు పూర్తి అండగా ప్రభుత్వ యంత్రాంగం ఉందన్నారు

# ఉమ్మడి కృష్ణాజిల్లాలో భారీ వర్షాలు

## రాకపోకలకు ఇబ్బందిగా మారిన వరదలు -పెనుగంచిప్రోలు నుండి మధిరకు నిలిచిన రాకపోకలు

విజయవాడ,**ఆగస్టు 28ప్రజావినికిడి,**

వాయువ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది.. ఒడిశా తీరాన్ని అనుకుని పశ్చిమ వాయువ్య దిశగా ప్రయాణం చేస్తోంది.. అల్పపీడన ప్రాంతం నుంచి దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా విస్తరించింది రుతుపవన ద్రోణి... దీని ప్రభావంతో.. రాగాల ఐదు రోజుల పాటు- ఆంధ్రప్రదేశ్‌తో పాటు- తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ.. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలో ఇవాళ భారీ వర్షాలు కురుస్తున్నాయి.. ఇక ఉమ్మడి కృష్ణాజిల్లాలో భారీ వర్షాల ప్రభావం స్పష్టంగా కనపడుతోంది. జగ్గయ్యపేటలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలలో వరి, పత్తి, పొలాలు నీట మునిగాయి. కూచి వాగు వరద ప్రవాహం ఎక్కువ ఉండటంతో పెనుగంచిప్రోలు నుండి తెలంగాణ మధిరకు రాకపోకలు నిలిచాయి. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం చందాపురం వద్ద నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఈరోజు ఉదయం ఒక్కసారిగా వరద ప్రవాహం పెరిగింది. నల్లవాగు



ఉధృతంగా ప్రవహించడంతో నందిగామ - చందర్లపాడు మండలాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇక, మైలవరం నియోజకవర్గంలో ఉన్న ఇబ్రహీంపట్నం మండలం చిలుకూరు వద్ద ఏనుగు గడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీనితో చిలుకూరు, దాములూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏనుగు గడ్డ వాగుకు పై ప్రాంతాల నుండి నీరు అధికంగా వస్తుండటంతో చిలుకూరు వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన ఇబ్రహీంపట్నంకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగు వద్ద ఎటు-వంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు- చేశారు. అవనిగడ్డలో హంసలదీవి బీచ్ గేట్లు- మూసేసారు. ఎడ్లంక గ్రామాన్ని నేడు సెంట్రల్ వాటర్ కమిషన్ సందర్శించనుంది. కృష్ణా వరదల ఉధృతికి ప్రమాదకర స్థాయిలో ఎడ్లంక గ్రామం కోతకు గురవుతోంది. ఎడ్లంక గ్రామ కోతపై హోమ్ మంత్రి అనితను, డిజాస్టర్ మేనేజ్మెంట్ సెక్రటరీ ప్రకాశ్ జైన్ ను కలసి సమస్యను స్థానిక తెలుగుదేశం నేత బొబ్బా గోవర్ధన్ వివరించారు. తక్షణం స్పందించిన హోమ్ మంత్రి నివేదిక గ్రామంలో పరిస్థితుల అధ్యయనంను జిల్లా యంత్రాంగం ప్రారంభించింది. కోత నివారణపై అధ్యయనం చేసేందుకు ఈ సాయంత్రం ఎడ్లంకకు సెంట్రల్ వాటర్ కమిషన్ అధికారులు రానున్నారు. మరోవైపు నూజివీడులో అకాల వర్షానికి ప్రధాన ప్రాంతాలు జలమయం అయ్యాయి. లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టిందని మంత్రి పార్థసారథి తెలిపారు.

# ఆధార్ తరహాలో ఫ్యామిలీ కార్డు

## అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం చంద్రబాబు

అమరావతి,**ఆగస్టు 28ప్రజావినికిడి,**

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ఆధార్ తరహాలో 'ఫ్యామిలీ కార్డు' ఇవ్వాలని సిఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ కార్డులో ప్రభుత్వ పథకాలు సహా అన్ని వివరాలు పొందుపర్చాలని, ఎప్పటికప్పుడు వివరాలను అప్‌డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ అవసరాలపై క్షేత్రస్థాయి సమాచారం తీసుకోవాలి. ప్రభుత్వ సంక్షేమం అవసరమైతే వెంటనే అందేలా వ్యవస్థను సిద్ధం చేయాలి. ప్రభుత్వ పథకాల కోసం కుటుంబాలు విడిపోయే పరిస్థితి రాకూడదు. అందరికీ లబ్ధి కలిగేలా పథకాల రీడిజైన్ అంశం పరిశీలిద్దాం. త్వరలోనే పాపులేషన్ పాలసీ తీసుకురావాలని సీఎం చంద్రబాబు అన్నారు. ఫ్యామిలీ బెనిఫిట్ మానిటరింగ్ వ్యవస్థపై ఏపీ సీఎం చంద్రబాబు గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు

. ఈ సమీక్షకు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఫ్యామిలీ కార్డ్ జారీ చేయాలని సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ ఫ్యామిలీ కార్డు ఇవ్వాలని సీఎం చంద్రబాబు సూచించారు.. ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో సహా అన్ని వివరాలను ఫ్యామిలీ కార్డులో ఏపీ ప్రభుత్వం పొందుపరచనుంది. త్వరలోనే పాపులేషన్ పాలసీ తీసుకురావాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఏయే కుటుంబానికి ఏమేం అవసరాలున్నాయనే అంశాన్ని క్షేత్రస్థాయి నుంచి సమాచారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమం అవసరమైన వారికి వెంటనే అందేలా వ్యవస్థను సిద్ధం చేయాలని మార్గనిర్దేశర చేశారు. ప్రతి కుటుంబానికి ఇచ్చే ఫ్యామిలీ కార్డులో ప్రభుత్వం ఇచ్చే పథకాల వివరాలను పొందుపరచాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆధార్ తరహాలో ఫ్యామిలీ కార్డును ఉపయోగించుకోవాలని దిశానిర్దేశర చేశారు. అందరికీ లబ్ధి కలిగేలా అవసరమైతే పథకాలను రీ-డిజైన్ చేసే అంశాన్నీ పరిశీలిద్దామని సీఎం చెప్పుకొచ్చారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు పెరగాలని వాటిని ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని సూచించామని అన్నారు. ప్రభుత్వ పథకాల కోసం కార్డుల్లో ఫ్యామిలీలను విభజించుకుంటున్నారంటూ సీఎం వ్యాఖ్యానించారు. కుటుంబం ఉమ్మడిగా ఉన్న సంక్షేమం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందులో భాగంగానే ఫ్యామిలీ కార్డులకు రూపకల్పన చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**ఉల్లి కొరత రాకుండా ముందే జాగ్రత్తలు**

**అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు**

ఉల్లి పంటను తక్షణమే కొనుగోలు చేసి నిల్వ చేయాలని ముఖ్యమం÷-తరి చంద్రబాబు నాయుడు సూచించారు. కమ్యూనిటీ- హాళ్లను అద్దెకు తీసుకుని ఉల్లిని ఆరబెట్టాలని ఆదేశాలు జారీ చేశారు.రైతుల నుంచి ఉల్లి కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మార్కెటింగ్ విభాగం అధికారులు హాజరయ్యారు. రైతుల నుంచి క్వింటాకు రూ.1200 చొప్పున ఉల్లిని కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఉల్లికి రేటు వచ్చే వరకూ కమ్యూనిటీ- హాళ్లల్లో నిల్వ చేయడానికి రైతులకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. వచ్చే పది రోజుల్లో ఐదువేల మెట్రిక్ టన్నుల ఉల్లి పంట వస్తుందని అధికారులు వివరించారు. కొనుగోలు చేసి ఆరబెట్టిన ఉల్లిని రైతు బజార్లల్లో విక్రయించేలా చర్యలు చేపట్టాలని దిశానిర్దేశర చేశారు. తక్షణం ఉల్లిని కొనుగోలు చేసి రైతులకు నష్టం రాకుండా చూడాలని ఆదేశించారు. అన్ని పంటల ధరల స్థిరీకరణ కోసం వేర్ హౌసింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. రైతుబజార్ల సంఖ్యను పెంచటంతో పాటు- ఆధునీకికరణకు వెంటనే చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశర చేశారు సీఎం చంద్రబాబు. మరోవైపు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో పలు కీలక అశాలపై చర్చించారు. ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలకు ప్రోత్సాహకాల ప్రతిపాదనలు, పరిశ్రమల కోసం ఏపీఐఐసీ ప్రతిపాదనలు, ప్రైవేటు- పార్కులు, ఎంఎస్ఎంఈ పార్కులు ప్రతిపాదనలపై సీఎం చంద్రబాబు చర్చించారు. ప్రైవేటు మెగా ఇండస్ట్రియల్ పార్కులు, టూరిజం శాఖ ప్రతిపాదనలు, విద్యుత్ శాఖ ప్రతిపాదనలపై మాట్లాడారు. ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ శాఖ ప్రతిపాదనలకు పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో చర్చించి ఆమోదం తెలిపామని అన్నారు. ఎస్ఐపీబీ ప్రతిపాదనలకు ఆమోదం తెలపడం ద్వారా రూ. 53,922 కోట్ల పెట్టుబడులతో 83,437 మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని వివరించారు.

# బుడమేరకు ప్రమాదం లేదు: కలెక్టర్

విజయవాడ,**ఆగస్టు 28ప్రజావినికిడి,**

ఎన్టీఆర్ జిల్లాలో వరద పరిస్థితిపై హోంమంత్రి అనిత, ఇతర ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు- కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. బుడమేరు వద్ద వరద ఏమీ లేదని.. 3 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. పరిస్థితి అంతా నియంత్రణలోనే ఉందన్నారు. ప్రజలు భయపడాల్సిన పనిలేదని కలెక్టర్ తెలిపారు. పోతుల వాగు, నల్ల వాగు వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఖమ్మం, వరంగల్‌లో కురుస్తున్న వర్షాలతో మున్నేరుకు వరద నీటి ప్రవాహం వస్తోంది. దీనివల్ల ఏపీలో ఇబ్బందికర పరిస్థితి లేదు. ప్రకాశం బ్యారేజీ వద్ద మరో గంటలో మొదటి ప్రమాద హెచ్చరికతో 95 గ్రామాలపై ప్రభావం పడుతుంది. వాళ్లకు పునరావాస కేంద్రాలు ఇప్పటికే ఏర్పాటు- చేశాం. కొండ ప్రాంతంలో ఉన్న వారు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలి. పల్లె నుంచి పట్నం వరకు యంత్రాంగం అప్రమత్తంగా ఉందని లక్ష్మీశ తెలిపారు.

----

# కృష్ణానదికి పెరుగుతున్న వరద

## అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు

మచిలీపట్నం,**ఆగస్టు 28ప్రజావినికిడి,**కృష్ణానదికి వరద ప్రవాహం మెల్లగా పెరుగుతోంది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నదీ పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వరద ఉధృతిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద ఉధృతి కారణంగా, ఇప్పటికే 3.26 లక్షల క్యూసెక్కుల నీరు నదిలోకి విడుదల చేసినట్లు- తెలిపారు. ఈ నేపథ్యంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. తోట్లవల్లూరు ప్రాంతంలో ప్రత్యేకంగా టీ-మ్ సిద్ధంగా ఉన్నట్లు- కలెక్టర్ తెలిపారు. ప్రమాదాన్ని ముందుగానే నివారించేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోందన్నారు. బుడమేర ముంపు ప్రాంతంలోని ప్రజలను ముందుగానే హెచ్చరించాం అని కలెక్టర్ వెల్లడించారు. వరద నీరు ఎక్కువగా వచ్చేందుకు అవకాశం ఉన్నందున, ఆ ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కృష్ణా నదికి ఆనుకుని ఉన్న లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన ప్రయాణ వాహనాలు, తాత్కాలిక ఆశ్రయ కేంద్రాలు, తాగునీరు, వైద్య సదుపాయాలు అన్ని సిద్ధం చేసినట్లు- జిల్లా కలెక్టర్ తెలిపారు. నది ఒడ్డున, లోతట్టు- ప్రాంతాల్లో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారుల సూచనలను పాటించాలని కోరారు. ఎవరూ వాగులు, వరద నీటిని దాటే ప్రయత్నం చేయకూడదని హెచ్చరించారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటు-న్నామని, ఎవ్వరూ ఆందోళన చెందవద్దని తెలిపారు.

# సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్

## 20కి పెరగనున్న కోచ్‌ల సంఖ్య

హైదరాబాద్,**ఆగస్టు 28ప్రజావినికిడి,** వందేభారత్‌కు లభిస్తున్న ఆదరణ నేపథ్యంలో రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. సికింద్రాబాద్-తిరుపతి సహా ఏడు మార్గాల్లో నడిచే వందేభారత్ రైళ్ల కోచ్‌ల సంఖ్యను పెంచాలని నిర్ణయించింది. దీంతో కోచ్‌ల సంఖ్య 20కి పెరగనుంది. సికింద్రాబాద్-తిరుపతి సహా మంగళూరు సెంట్రల్- తిరువనంతపురం, చెన్నై ఎగ్మోర్-తిరునల్వేలి మార్గాల్లో ప్రస్తుతం 16 కోచ్‌ల వందేభారత్ నడుస్తుండగా.. దీనిని 20 కోచ్‌లకు పెంచనున్నారు. మిగతా నాలుగు మార్గాల్లో ఎనిమిది కోచ్‌ల రైళ్లు నడుస్తుండగా.. వాటి స్థానంలో 16 కోచ్‌లు అందుబాటు-లోకి రానున్నాయి. ఈ ఏడు మార్గాల్లో కోచ్‌ల అప్‌గ్రేడ్‌తోపాటు- మరిన్ని 20 కోచ్‌ల వందేభారత్ రైళ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు. కొత్తగా వచ్చే 16, 8 కోచ్‌ల రైళ్లను కొత్త మార్గాల్లో ఉపయోగిస్తామన్నారు.

సికింద్రాబాద్-తిరుపతి, మంగళూరు సెంట్రల్- తిరువనంతపురం, చెన్నై ఎగ్మోర్-తిరునల్వేలి, మదురై-బెంగళూరు కంటోన్మెంట్, దేవ్‌గఢ్-వారణాసి, హవ్‌డా-రౌర్కెలా, ఇండోర్-నాగ్‌పూర్ మధ్య నడిచే వందేభారత్ రైళ్లలో ఎక్కువ కోచ్‌లు అందుబాటు-లో ఉండనున్నాయి.ప్రస్తుతం మూడు మార్గాల్లో 16 కోచ్‌లు, నాలుగు రూట్‌లలో ఎనిమిది కోచ్‌ల వందేభారత్ రైళ్లు నడుస్తున్నట్లు- అధికారులు వెల్లడించారు. 16 కోచ్‌ల రైలును 20 కోచ్‌లతో, ఎనిమిది కోచ్‌ల రైళ్ల స్థానంలో 16 కోచ్‌లకు అప్‌గ్రేడ్ చేయనున్నట్లు- రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రజా సంబంధాలు) దిలీప్ కుమార్ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో (జులై 31, 2025 నాటికి) వందేభారత్ రైళ్ల రద్దీ సమాచారాన్ని పరిగణనలోకి తీసుకొని వీటిని అందుబాటు-లో ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

-----

# ఏపీలో రూ. 53 వేల కోట్ల పెట్టుబడులు పెట్టే ప్రాజెక్టులకు ఆమోదం..

**%ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోని ఎస్ఐపీబీ**

**వేగంగా పారిశ్రామిక ప్రాజెక్టులు పూర్తవ్వాలన్న ముఖ్యమంత్రి**

**ఏరో స్పేస్, ఐటీ, ఇంధనం, ఫుడ్ ప్రాసెసింగ్, ఎంఎస్ఎంఈ రంగాల్లో పెట్టుబడులు**

**రూ.53,922 కోట్ల మేర పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం**

**ఈ ప్రాజెక్టులతో 83,437 మందికి ఉద్యోగ అవకాశాలు**

**నవంబర్ 15లోగా ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు**

**బిజినెస్ సెంటర్ల తరహాలో పారిశ్రామిక పార్కులతో ఎకో సిస్టం**

**ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 10వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం**



**ఆగస్టు 28ప్రజావినికిడి,**

రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామిక ప్రాజెక్టులు వేగంగా పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో త్వరగా అనుమతులు ఇస్తున్నామని, అదే తరహాలో ప్రాజెక్టుల గ్రౌండింగ్ కూడా అంతే వేగంగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి అధ్యక్షతన 10వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది. రూ. 53,922 కోట్ల మేర పెట్టుబడులు పెట్టే 30 ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోని ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 83,437 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న ప్రాజెక్టుల పురోగతిపై ఇక నుంచి ప్రతీ నెలా సమీక్షిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఈ ప్రాజెక్టుల్లో స్థితిగతులపై క్షేత్రస్థాయిలో మంత్రులు కూడా పరిశీలించాలని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ అనుమతులు ఇచ్చిన ప్రాజెక్టుల వివరాలను, ఉత్పత్తి ప్రారంభించేందుకు ఎంత సమయం పట్టిందన్న అంశాలను విశ్లేషించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఏ ప్రాజెక్టు అయినా ఆలస్యం అవుతుంటే సంబంధిత సంస్థల ప్రతినిధులతో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలన్నారు.

రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని, అధికారులు కూడా అదే వేగంతో పనిచేయాలని సూచించారు. మహింద్రా ఈవీ వాహనాల ఉత్పత్తి ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేసేలా తానే స్వయంగా సంప్రదిస్తున్నానని, దీనికి అనుగుణంగా అధికారులూ కూడా స్పందించాలని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలదే ప్రధాన భూమిక**

వ్యవసాయ ఆధారిత రాష్ట్రమైన ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలే కీలకమని, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపుతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇవి ప్రధాన భూమిక పోషిస్తాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు పుష్కలంగా అవకాశాలున్నాయని అన్నారు.

పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించేందుకు అధికారులు ప్రముఖ కంపెనీలతో సంప్రదింపులు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. చిత్తూరు, అన్నమయ్య తదితర జిల్లాల్లో స్థానికంగా ఉన్న మ్యాంగో ప్రాసెసింగ్ పరిశ్రమల వల్లే రైతులకు ఎక్కువ ఇబ్బంది లేకుండా చూడగలిగామని అన్నారు. పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటకలలో ఈ తరహా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు లేవన్నారు.

**బిజినెస్ సెంటర్ల తరహాలో ఎంఎస్ఎంఈ పార్కులతో ఎకో సిస్టం**

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు పూర్తి కావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభించిన ప్రాంతాల్లో మినహా మిగతా నియోజకవర్గాల్లో 3 నెలల్లో ఈ పార్కులు అందుబాటులోకి రావాలన్నారు. ఈ పారిశ్రామిక పార్కులన్నీ బిజినెస్ సెంటర్లలా చేసి ఒక ఎకో సిస్టంను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతులు, భూ యజమానుల్ని కూడా ఈ పారిశ్రామిక పార్కుల్లో భాగస్వాములను చేయాలని సీఎం స్పష్టం చేశారు. తద్వారా వారికి ఆదాయం వచ్చేలా చేయాలని అన్నారు. అలాగే రాష్ట్రంలో మెగా, మీడియం స్థాయిలో పారిశ్రామిక పార్కులను నియోజకవర్గాల వారీగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఈ పారిశ్రామిక పార్కులకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లను అనుసంధానించటంతో పాటు వాటికి ప్రామాణిక మార్గదర్శకాలను నిర్దేశించాలన్నారు.

పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో ఆర్టీఐహెచ్ ద్వారా జరిగే కార్యకలాపాలను సమీక్షించాలని సీఎం సూచించారు. మరోవైపు రాష్ట్రంలోని ఆటోనగర్ లలో రెడ్, ఆరెంజ్ కేటగిరీ పరిశ్రమలకు తదుపరి అనుమతులు రాకపోవటంపై సమీక్షించిన సీఎం దీనికి తగిన కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఏపీకి పరిశ్రమలు రావటం ముఖ్యమన్న సీఎం.. ఇంధన ఉత్పత్తి, ఐటీ, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్, మైనింగ్ ఆధారిత వాల్యూ చైన్ పరిశ్రమల్లో పెట్టుబడులు రావాల్సి ఉందన్నారు. అలాగే ఐటీ రంగంలో వర్క్ ఫ్రమ్ హోమ్, కో-వర్కింగ్ స్పేస్ లను ఏర్పాటు చేయాలన్నారు.

మరోవైపు గత పాలకులు తిరుపతి వేంకటేశ్వరస్వామి ఏడుకొండల పవిత్రతను దెబ్బతీసేలా ప్రవర్తించారని, కొండను ఆనుకుని హోటల్ నిర్మాణానికి స్థలం కేటాయించిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయంగా స్థలం చూపామని అన్నారు. దీనిపై కొందరు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, సీఎస్ కె.విజయానంద్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.



# టాలీవుడ్ హీరోయిన్‌తో పృథ్వీ షా డేటింగ్

టీమిండియా క్రికెటర్ పృథ్వీ షా మరోసారి వార్తల్లో నిలిచాడు. రూమర్డ్ గర్ల్ ఫ్రెండ్, టాలీవుడ్ హీరోయిన్ అకృతి అగర్వాల్‌తో కలిసి వినాయక చవితి పూజల్లో పాల్గొన్నాడు. ఇందుకు సంబంధించిన ఫొటోస్ అకృతి తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఇద్దరూ గణేశుడి విగ్రహం పక్కన నిలబడి ఉన్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. పెయిర్ బాగుంది అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. అకృతి అగర్వాల్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో టిక్‌టాక్‌లో డ్యాన్స్ వీడియోలు చేసి పాపులర్ అయ్యారు. దేశంలో టిక్‌టాక్ నిషేధించబడిన తర్వాత ఆమె ఇన్‌స్టాగ్రామ్‌పై దృష్టి పెట్టారు. ఇప్పుడు ఆమెకు 3.3 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. యూట్యూబ్ ఛానెల్‌కు 88.8 వేలమంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఈ ఏడాది ఆరంభంలో విడుదలైన 'త్రిముఖ' అనే టాలీవుడ్ మూవీలో అకృతి హీరోయిన్‌గా నటించారు. బాలీవుడ్ ఆరంగేట్రంకు సిద్ధమవుతున్నారు. ఫామ్ కోల్పోయిన పృథ్వీ షా భారత జట్టులో చోటు కోల్పోయాడు. ముంబై క్రికెట్ అసోషియేషన్‌కు టాటా చెప్పిన అతడు.. ప్రస్తుతం మహారాష్ట్రకు ఆడుతున్నాడు. బుచ్చిబాబు టోర్నీ 2025లో ఆడుతున్న పృథ్వీ షా.. ఛత్తీస్‌ఘడ్ (111)పై సెంచరీ చేశాడు. తమిళనాడుపై కూడా హాఫ్ సెంచరీ బాది సత్తాచాటాడు. లక్నోకు చెందిన అకృతి అగర్వాల్.. ముంబైలో చదువుకుంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా కెరీర్ ప్రారంభించి నటిగా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు 3.3 మిలయన్ల ఫాలోవర్లు ఉన్నారు. ఇటీవల విడుదలైన త్రిముఖ చిత్రంలో కూడా ఆమె నటించింది. అకృతి అగర్వాల్‌కు సొంతంగా ఓ యూట్యూబ్ ఛానెల్ కూడా ఉంది. పృథ్వీ షా, ఆకృతి గతంలో చాలా సార్లు కలిసి కనిపించారు. జులైలో పృథ్వీ షా షేర్ చేసిన ఓ ఫొటో కింద అకృతి కామెంట్ చేసింది. అప్పుడే ఈ ఇద్దరి మధ్య ప్రేమాయణం నడుస్తున్నట్లు పుకార్లు మొదలయ్యాయి. తాజాగా ఈ ఇద్దరూ కలిసి గణపతి పూజ చేయడంతో ఈ వార్తలకు బలం చేకూరింది. పృథ్వీ షా గతంలో ప్రాచీ సింగ్, నిధి తపాడియాతో కూడా డేటింగ్ చేసినట్లు వార్తలు వచ్చాయి. అండర్ 19 ప్రపంచకప్ విజయంతో భారత క్రికెట్‌లోకి దూసుకొచ్చిన పృథ్వీ షా అంతే వేగంగా దూరమయ్యాడు. గాయాలు, ఫిట్‌నెస్ సమస్యలతో పాటు చెడు స్నేహాలు పృథ్వీ షా కెరీర్‌ను నాశనం చేశాయి. ఐపీఎల్ 2025 సీజన్ మెగా వేలంలో అతను అన్‌సోల్డ్‌గా నిలిచాడు. దేశవాళీ క్రికెట్‌లో ముంబై జట్టు నుంచి తప్పుకున్న పృథ్వీ షా మహారాష్ట్ర తరఫున తన ప్రయాణాన్ని ఘనంగా ప్రారంభించాడు. తమిళనాడు వేదికగా సాగుతున్న బుచ్చిబాబు టోర్నీలో మహారాష్ట్ర తరఫున అరంగేట్ర మ్యాచ్‌లోనే శతకంతో చెలరేగాడు.

# నేటి నుంచే కబడ్డీ పండుగ

- పీకేఎల్ సరికొత్త సీజన్ ప్రారంభం
- విశాఖపట్టణం వేదికగా అకురార్పణ



కబడ్డీ క్రీడను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సరికొత్త సీజన్‌కు సర్వం సిద్ధమైంది. విశాఖపట్టణం వేదికగా దేశీయ కబడ్డీ లీగ్ ప్రారంభం కానుండగా ఈవెంట్‌కు అన్నీ ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాతీయ క్రీడా దినోత్సవాన వైజాగ్‌లో కబడ్డీ పండగ ప్రారంభం కానుంది. ప్రొ కబడ్డీ లీగ్ 12వ సీజన్ ప్రారంభానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు హాజరుకానున్నాయి. పీకేల్ కొత్త సీజన్ విశేషాలు ఇలా ఉన్నాయి. కోట్లాది మంది కబడ్డీ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. శుక్రవారం ఆరంభ మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్‌తో తెలుగు టైటాన్స్ ఢీ కొట్టనుంది. ఈసారి వినూత్న మార్పులతో సరికొత్త ఉత్సాహం, ఉత్కంఠమైన పోరాటాలతో ఈ సీజన్ ప్రేక్షకులకు కనువిందు చేయనుంది. ఏడేళ్ల తర్వాత వైజాగ్‌కు ఈ లీగ్ తిరిగి వస్తోంది. జాతీయ క్రీడా దినోత్సవం రోజున ప్రారంభం కానుండడంతో పెద్ద స్థాయిలో క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ సీజన్ ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు, ఫేవరెట్ అయిన తెలుగు టైటాన్స్.. తమిళ్ తలైవాస్‌తో తలపడనుంది. రెండో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్, పుణెరి పల్టాన్ జట్లు పోటీపడనున్నాయి. ఈ మ్యాచ్‌లు వైజాగ్‌లోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో జరగనున్నాయి. కొత్త సీజన్ కు శ్రీకారం చుడుతూ గురువారం వరుణ్ బీచ్‌లోని నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమం క్రీడాకారులు, నిర్వాహకుల ఉత్సాహంతో నిండిపోయింది.




# అత్యధిక స్కోర్లు చేసిన జట్లలో భారత్ అగ్రస్థానం

- ఆసియా కప్ టీ20 చరిత్రలో రికార్డు

టీ20 క్రికెట్ అంటే పరుగుల పండుగ. బ్యాటర్లకు ఎక్కువగా కలిసొస్తుందని క్రికెట్ ప్రేమికులు కూడా భావిస్తారు. ఈసారి ఆసియా కప్ టీ20 ఫార్మాట్లో జరుగుతుంది. బ్యాట్స్‌మెన్‌లు భారీ స్కోర్‌లతో జట్టుకు విజయాలు అందించారు. అయితే ఈ టోర్నమెంట్‌లో భారత్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తుంది. పాకిస్తాన్ 2022 సంవత్సరం షార్జాలో జరిగిన మ్యాచ్‌లో హాంకాంగ్ బౌలర్లను ఉతికారేసింది. పాక్ కెప్టెన్ బాబర్ ఆజం, మహ్మద్ రిజ్వాన్ చేసిన భారీ భాగస్వామ్యంతో 193 పరుగులు చేసి ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని ఇచ్చింది. ఈ స్కోరు ఆసియా కప్ %ు%20 చరిత్రలో పాకిస్తాన్ జట్టుకు అత్యధిక స్కోరు. భారత్ జట్టు చేసిన స్కోరు ఈ జాబితాలో మూడవ స్థానంలో ఉంది. భారత్ 2022లో హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. ఇండియా 20 ఓవర్లలో కేవలం 2 వికెట్లు కోల్పోయి 192 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్, విరాట్ కోహ్లీ అద్భుత బ్యాటింగ్‌తో భారత్ భారీ స్కోర్ సాధించింది. ఈ మ్యాచ్ లో హాంకాంగ్ ఓడిపోయింది. శ్రీలంకతో 2022లో దుబాయ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 8 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. శ్రీలంక జట్టు 19.2 ఓవర్లలో బంగ్లా ఇచ్చిన లక్ష్యాన్ని ఛేదించింది. ఈ ఇన్నింగ్స్‌లో శ్రీలంక బ్యాట్స్‌మెన్‌లు అద్భుతంగా రాణించి జట్టును గెలిపించారు. బంగ్లాదేశ్ మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 183 పరుగులు చేసింది. అయితే, ఇంత పెద్ద స్కోరు చేసినా బౌలర్లు డిఫెండ్ చేయలేకపోయారు. శ్రీలంక చివరి ఓవర్లలో అద్భుతమైన బ్యాటింగ్‌తో భారీ లక్ష్యాన్ని ఛేదించింది. టోర్నమెంట్‌లో అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లలో ఒకటిగా నిలిచింది.

# రాజమౌళిపై ధోనీ ప్రశంసల జల్లు



సౌతిండియాలో సూపర్ స్టార్ రజినీకాంత్‌తో పాటు సూర్య అంటే తనకు చాలా ఇష్టమని టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తెలిపాడు. సమయం దొరికితే వారి సినిమాలు చూస్తానని చెప్పాడు. గతంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ధోనీ.. ఫేవరేట్ హీరోలకు గురించి ప్రశ్నించగా ఈ వ్యాఖ్యలు చేశాడు. సూర్యకు చెందిన సింగమ్ మూవీని సబ్‌టైటిల్స్‌తో చూశానని, బాగా నచ్చిందని కూడా ధోనీ చెప్పాడు రజినీకాంత్ అంటే తనకు చిన్నప్పటి నుంచి ఇష్టమని ధోనీ అనేక ఇంటర్వ్యూల్లో చెప్పుకొచ్చాడు. రజినీకాంత్‌కు తాను డైహార్డ్ ఫ్యాన్ అని, ఆయన సినిమాలు చిన్నప్పటి నుంచి చూసేవాడినన్నాడు. తెలుగు హీరోల గురించి ధోనీ ఎక్కడా నేరు ప్రస్తావించకున్నా.. అల్లు అర్జున్, మెగాస్టార్ చిరంజీవి, సూపర్ స్టార్ మహేష్ బాబు సినిమాలు చూస్తారనే ప్రచారం ఉంది. తన జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఎంఎస్ ధోనీ అన్‌టోల్డ్ స్టోరీస్ మూవీకి సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరగ్గా.. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ రాజమౌళి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజమౌళిపై ధోనీ ప్రశంసల జల్లు కురిపించాడు. రాజమౌళి సినిమాలంటే తనకు ఇష్టమని, ఆయనతో కలిసి వేదిక పంచుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. ధోనీ తన సొంత నిర్మాణ సంస్థ 'ధోనీ ఎంటర్‌టైన్‌మెంట్' ద్వారా తమిళంలో 'లెట్స్ గెట్ మ్యారీడ్' (%జా+వీ%) అనే సినిమాను నిర్మించారు. ఈ సినిమా తెలుగులోకి కూడా రిలీజ్ అయ్యింది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో ధోనీ సతీమణి సాక్షి సింగ్ పాల్గొని ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అంటే తనకు ఇష్టమని తెలిపింది. 'ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ లేని రోజుల్లోనే హిందీలోకి డబ్ అయిన అల్లు అర్జున్ సినిమాలను యూట్యూబ్‌లోని గోల్డ్‌మైన్ ప్రొడక్షన్స్ ఛానెల్‌లో చూసేదాన్ని. అల్లు అర్జున్‌కు సంబంధించిన అన్ని సినిమాలను చూశాను. నేను అల్లు అర్జున్‌కు పెద్ద అభిమానిని. ప్రస్తుతానికి ఆయనతో సినిమా తీసేంత బడ్జెట్ మా దగ్గర లేదు. కానీ భవిష్యత్తులో తప్పకుండా ప్రయత్నిస్తాం'అని సాక్షి సింగ్ చెప్పుకొచ్చారు.

# 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడటమే నా లక్ష్యం

**నా రిటైర్‌మెంట్ ఎప్పుడనేది ఎవరూ నిర్ణయించలేరు**

**ఆటపై విసుగు వచ్చేవరకే ఆడుతూనే ఉంటాను**

**టీమ్ ఇండియాకు సీనియర్ ప్లేయర్ మహ్మద్ షమీ**



టీమ్ ఇండియాకు సీనియర్ ప్లేయర్ మహ్మద్ షమీ తన రిటైర్‌మెంట్‌పై వస్తున్న వార్తలకు చెక్ పెట్టాడు. ఇప్పటికే ముగ్గురు సీనియర్ క్రికెటర్లు టెస్టులకు వీడ్కోలు పలికిన నేపథ్యంలో తన పేరు కూడా జాబితాలో ఉందన్న రూమర్స్‌పై షమీ స్పష్టతనిచ్చాడు. రెండేళ్లుగా టెస్టు క్రికెట్ ఆడని షమీ గాయాలతో ఇబ్బందులు ఎదుర్కొన్నా, 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడటం తన లక్ష్యమని చెప్పాడు. "నా రిటైర్‌మెంట్ ఎప్పుడనేది ఎవరూ నిర్ణయించలేరు. ఆటపై విసుగు వచ్చేవరకే ఆడతాను. ఒకవేళ అంతర్జాతీయ క్రికెట్‌లో అవకాశం లేకపోతే దేశవాళీ క్రికెట్‌లో కొనసాగుతా. నేను రిటైర్ అయితే ఎవరి జీవితాలు బాగుపడతాయో చెప్పండి అప్పుడు ఆలోచిస్తా. అంతవరకు ఇలాంటి ఊహాగానాలకు విలువే లేదు" అని షమీ స్పష్టం చేశాడు. తాజాగా తన ఫిట్‌నెస్ పరిస్థితిని కూడా వివరించాడు. "గత రెండు నెలల్లో శరీర బరువును కంట్రోల్ చేశా. నైపుణ్యాలను పదును పెట్టా. సుదీర్ఘంగా స్పెల్స్ వేసేలా ప్రాక్టీస్ చేస్తున్నా. ఫీల్డింగ్, బ్యాటింగ్‌లో కూడా కష్టపడి సాధన చేశా. ఇప్పుడు అన్ని విషయాల్లో కంఫర్ట్‌గా ఉన్నా" అని చెప్పాడు. "నాకు ఇప్పటికీ ఒక కల ఉంది వన్డే వరల్డ్‌కప్‌ను సగర్వంగా ఎత్తుకోవాలి. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో ఫైనల్‌కు చేరాం. అభిమానుల మద్దతుతో అక్కడికి వెళ్లాం. కానీ ఫైనల్లో కొంచెం అదృష్టం కలిసి వచ్చిఉంటే ట్రోఫీ మనదే అయ్యేది" అని షమీ గుర్తు చేసుకున్నాడు. మొత్తానికి షమీ రిటైర్‌మెంట్‌పై వస్తున్న వార్తలు కేవలం గాలివార్తలేనని తాను ఇంకా టీమ్‌ఇండియాకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశాడు. ఇటీవల షమీ ప్రత్యేక మైలురాయిని చేరుకున్నాడు. వేగంగా 200 వన్డే వికెట్లు తీసిన భారత బౌలర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. మొత్తంగా ఈ ఫీట్ సాధించిన రెండో వేగవంతమైన బౌలర్‌గా నిలిచాడు. కేవలం 104వ మ్యాచుల్లో ఈ ఘనతను సాధించాడు. 133 మ్యాచుల్లో ఈ రికార్డు అందుకున్న భారత మాజీ పేసర్ అజిత్ అగార్కర్‌ను అధిగమించాడు. ఓవరాల్‌గా మిచెల్ స్టార్క్ (102) షమీ కంటే ముందున్నాడు. ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీల్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. తన ఖాతాలో 60 వికెట్లు వేసుకున్నాడు. అతడి తర్వాత జహీర్ ఖాన్ (59), జవగల్ శ్రీనాథ్ (47) ఉన్నారు. షమీ తన చివరి వన్డే మ్యాచ్‌ను 2023 నవంబర్ 19న ఆస్ట్రేలియాతో ఆడాడు. అదే ఐసీసీ వన్డే ప్రపంచ కప్ 2023 ఫైనల్ మ్యాచ్. ఆ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా పరాజయంపాలై వరల్డ్ కప్‌ను చేజార్చుకుంది. ఆ తర్వాత గాయం కారణంగా షమీ అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమయ్యాడు. ఇటీవలే ఇంగ్లాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో షమీ మళ్లీ రీఎంట్రీ ఇచ్చాడు. ఆఖరి రెండు మ్యాచ్‌లు ఆడాడు. అయితే ఒక మ్యాచ్‌లో వికెట్లేమీ తీయలేదు. మరో టీ20లో మాత్రం మూడు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు.

# ఈస్ట్ జోన్ జట్టు కెప్టెన్‌గా రియాన్ పరాగ్



బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదికగా ప్రారంభమైన దులీప్ ట్రోఫీ టెస్ట్ టోర్నమెంట్‌లో పలు అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. మొదట నిర్ణయించిన కెప్టెన్లు అనారోగ్యం, గాయాల కారణంగా దూరంగా ఉండటంతో జట్టు నాయకత్వంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈస్ట్ జోన్ జట్టు కెప్టెన్‌గా మొదట ఇషాన్ కిషన్ ఎంపికయ్యారు. అయితే గాయం కారణంగా అతను టోర్నమెంట్ నుండి తప్పుకున్నాడు. అతని స్థానంలో అభిమన్యు ఈశ్వరన్‌కు కెప్టెన్సీ పగ్గాలు అప్పగించారు. కానీ దురదృష్టవశాత్తు ఈశ్వరన్ కూడా జ్వరంతో బాధపడుతుండటంతో ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. దీంతో యువ ఆటగాడు రియాన్ పరాగ్ ఈస్ట్ జోన్ జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. అదే సమయంలో నార్త్ జోన్ జట్టుకు భారత టెస్ట్ జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహించాల్సి ఉంది. కానీ అనారోగ్యం కారణంగా అతను కూడా టోర్నమెంట్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో అంకిత్ కుమార్ నార్త్ జోన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఈస్ట్ జోన్ కెప్టెన్ ర్యాన్ పరాగ్ బౌలింగ్ ఎంచుకున్నాడు. ఈ నిర్ణయంతో నార్త్ జోన్ ముందుగా బ్యాటింగ్‌కు దిగింది. పరాగ్ నాయకత్వంలో భారత సీనియర్ ఆటగాళ్లు మొహమ్మద్ షమీ, ముఖేష్ కుమార్ ఈస్ట్ జోన్ తరఫున బరిలోకి దిగడం విశేషం. నార్త్ జోన్ ప్లేయింగ్ 11: శుభమ్ ఖజురియా, అంకిత్ కుమార్ (కెప్టెన్), యష్ ధుల్, ఆయుష్ బడోని, కన్హయ్య వాధవన్ (వికెట్ కీపర్), సాహిల్ లోత్రా, నిశాంత్ సింధు, హర్షిత్ రాణా, ఆకిబ్ నబీ దార్, మయాంక్ డాగర్, అర్ష్‌దీప్ సింగ్. ఈస్ట్ జోన్ ప్లేయింగ్ 11: ఉత్కర్ష్ సింగ్, శరణ్‌దీప్ సింగ్, విరాట్ సింగ్, రియాన్ పరాగ్ (కెప్టెన్), కుమార్ కుషాగ్రా (వికెట్ కీపర్), శ్రీదామ్ పాల్, సూరజ్ సింధు జైస్వాల్, ముఖ్తార్ హుస్సేన్, మహ్మద్ షమీ, మనీషి, ముఖేష్ కుమార్.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## ఆసక్తికరంగా తేజ సజ్జ 'మిరాయ్' ట్రైలర్




టాలీవుడ్ యువ నటుడు తేజ సజ్జ నటిస్తున్న తాజా చిత్రం 'మిరాయ్'. యాక్షన్-అడ్వెంచర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. సినిమా విడుదలకు సమయం దగ్గర పడుతుండటంతో ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేస్తూ మూవీ ట్రైలర్‌ను ఈ రోజు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్నారు. భారీ చిత్రాలకు కేరాఫ్‌గా నిలుస్తున్న పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీ.జీ. విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తేజ సజ్జ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఈ సినిమాలో భారీ తారాగణం ప్రేక్షకులను ఆకట్టుకోనుంది. ముఖ్యంగా నటుడు మంచు మనోజ్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు శ్రియ శరణ్, జగపతి బాబు, జయరామ్ వంటి ప్రముఖ నటీనటులు కూడా ఈ చిత్రంలో భాగమయ్యారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమాను సెప్టెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది.

## ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్ ఇచ్చిన నివేదా పేతురాజ్..
## వ్యాపారవేత్తతో ఏడడుగులు






ప్రముఖ టాలీవుడ్ నటి నివేదా పేతురాజ్ తన అభిమానులకు ఓ తీపి కబురు అందించారు. త్వరలోనే తాను వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. తనకు కాబోయే భర్తను పరిచయం చేస్తూ, ఇప్పటికే తమ నిశ్చితార్థం కూడా జరిగిపోయిందని వెల్లడించారు. ఈ మేరకు ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫొటో ప్రస్తుతం వైరల్ అవుతోంది. నివేదా పేతురాజ్ వివాహం చేసుకోబోయే వ్యక్తి పేరు రాజ్‌హిత్ ఇబ్రాన్. ఆయన ఒక వ్యాపారవేత్త అని సమాచారం. రాజ్‌హిత్ దుబాయ్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అనే ప్రచారం జరుగుతోంది. వీరి వివాహ వేడుక ఈ ఏడాది చివరి నాటికి జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ వేడుకను ఎలాంటి ఆడంబరాలు లేకుండా కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో నిరాడంబరంగా నిర్వహించాలని ఇరు కుటుంబాలు నిర్ణయించుకున్నట్లు సమాచారం. పెళ్లికి సంబంధించిన మరిన్ని అధికారిక వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి. నివేదా పెళ్లి వార్త తెలియగానే ఆమె అభిమానులు, శ్రేయోభిలాషులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా కొత్త జంటకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. చాలామంది ఆమె కాబోయే భర్త వివరాల కోసం ఆసక్తిగా వెతుకుతున్నారు. తమిళ చిత్రం 'ఒరు నాల్ కూతు'తో నటిగా అరంగేట్రం చేసిన నివేదా, 'మెంటల్ మదిలో' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆ తర్వాత 'అల వైకుంఠపురములో', 'చిత్రలహరి', 'బ్రోచేవారెవరురా', 'దాస్ కా ధమ్కీ' వంటి విజయవంతమైన చిత్రాలలో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

## 'ఓజీ' మెలోడీ ట్రీట్..
## 'సువ్వి సువ్వి' వచ్చేసింది!



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఓజీ' చిత్రం నుంచి మరో అప్‌డేట్ వచ్చేసింది. వినాయక చవితి పండగను పురస్కరించుకుని చిత్ర బృందం ఈ రోజు ఉదయం 10:08 గంటలకు 'సువ్వి సువ్వి' పేరుతో రెండో పాటను విడుదల చేసింది. ఇది పూర్తి రొమాంటిక్ మెలోడీ సాంగ్ కాగా, ఇందులో పవన్ కల్యాణ్, హీరోయిన్ ప్రియాంకా అరుల్ మోహన్ మధ్య కెమిస్ట్రీని అందంగా చిత్రీకరించారు. పండగ వాతావరణంలో సాగే ఈ పాట అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇప్పటికే విడుదలైన తొలి పాట 'ఫైర్ స్ట్రోమ్' సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. తెలుగు, ఇంగ్లీష్, జపనీస్ పదాలతో సాగిన ఆ పాట సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. హీరోయిజాన్ని ఎలివేట్ చేసే ఆ పాట తర్వాత, ఇప్పుడు పూర్తి భిన్నంగా ఓ ప్రేమ గీతాన్ని విడుదల చేయడం ద్వారా 'ఓజీ'లో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయని చిత్ర యూనిట్ సంకేతాలిచ్చింది. ఇదిలా ఉండగా.. గత కొన్ని రోజులుగా 'ఓజీ' షూటింగ్ ఇంకా పూర్తి కాలేదని, సినిమా విడుదల వాయిదా పడవచ్చని కొన్ని ప్రచారాలు జరిగాయి. ఈ పుకార్లకు చిత్ర బృందం తాజాగా చెక్ పెట్టింది. సినిమా చిత్రీకరణ మొత్తం పూర్తయిందని, ముందుగా ప్రకటించినట్టుగానే సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రావడం ఖాయమని స్పష్టం చేసింది. అంతేకాకుండా అమెరికాలో సెప్టెంబర్ 24 నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్నాయని, దీనికి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్‌ను ఈ నెల 29 నుంచి మొదలుపెట్టనున్నట్లు తెలిపింది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రకాశ్ రాజ్, శ్రియా రెడ్డి, హరీశ్ ఉత్తమన్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వరుసగా పాటలను విడుదల చేస్తూ సినిమా ప్రమోషన్లలో వేగం పెంచిన 'ఓజీ' టీం, సినిమాపై హైప్‌ను మరింత పెంచుతోంది.

## లేహ్ లో చిక్కుకుపోయిన మాధవన్..
### వర్షాలకు విమానాలు రద్దయ్యాయని వెల్లడి




జమ్మూకశ్మీర్ లో వర్షాల కారణంగా విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. పలు విమానాలను అధికారులు రద్దు చేశారు. దీంతో ప్రముఖ నటుడు మాధవన్ లేహ్ లో చిక్కుకుపోయారు. ఈ విషయాన్ని ఆయన తన ఇన్ స్టా ఖాతాలో పంచుకున్నారు. వర్షాల కారణంగా విమానాలు రద్దవడంతో లేహ్ లోనే ఉండిపోవాల్సి వచ్చిందని, ఇది 17 ఏళ్ల నాటి సంగతిని గుర్తుచేసిందని చెప్పారు. తాను లఢఖ్ ను సందర్శించిన ప్రతిసారీ ఇలానే జరుగుతుందని చెప్పుకొచ్చారు.
2008లో త్రీ ఇడియట్స్ సినిమా షూటింగ్ కోసం లఢఖ్ వచ్చినప్పుడు కూడా ఇలానే జరిగిందని మాధవన్ చెప్పారు. అప్పుడు విపరీతంగా మంచు కురవడంతో విమానాశ్రయాలు మూసివేశారని వివరించారు. దీంతో షూటింగ్ కోసం వచ్చిన నటీనటుల బృందం మొత్తం ఇక్కడే ఉండిపోవాల్సి వచ్చిందని తెలిపారు. అయితే, ఈ ప్రాంతం ఎలా ఉన్నప్పటికీ అందంగానే ఉంటుందని వివరించారు.

## విజయ్ కాంత్ కుమారుడితో 'కెప్టెన్ ప్రభాకర్ 2'



విజయ్ కాంత్ ప్రధానపాత్రలో ఆర్కే సెల్వమణి రూపొందించిన 'కెప్టెన్ ప్రభాకర్'(1991) ఇండియన్ సినిమా హిస్టరీలో మేటి క్లాసిక్స్‌లో ఒకటిగా నిలిచింది. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ జీవితం ఆధారంగా రూపొందించిన ఈ చిత్రంలో విజయ్ కాంత్ అటవీ శాఖ అధికారి(ఐ.ఎఫ్.ఎస్) అద్భుతంగా నటించారు. ఈ చిత్రంలో రమ్యకృష్ణ కథానాయికగా నటించారు. వీరభద్రన్ పాత్రలో మన్సూర్ అలీఖాన్ నటనకు గొప్ప పేరొచ్చింది. ఇప్పుడు ఈ సినిమాని దాదాపు 34 ఏళ్ల అనంతరం రీమాస్టర్ చేసి నాణ్యమైన వెర్షన్ ని రీరిలీజ్ చేయగా, అద్భుత స్పందన వచ్చింది. విజయ్ కాంత్ ఫ్యాన్స్ థియేటర్లలో సందడి చేసారు. చిత్ర దర్శకుడు ఆర్కే సెల్వమణి ఈ క్లాసిక్ సినిమాని వీక్షించేందుకు కెప్టెన్ అభిమానులతో పాటు పాత జనరేషన్, యువతరం కూడా విచ్చేయడంపై ఆనందం వ్యక్తం చేసారు. నేటి జెన్ జెడ్ కిడ్స్ కూడా థియేటర్లలో సినిమాని వీక్షించేందుకు ఆసక్తిని కనబరిచారని తెలిపారు. కెప్టెన్ ప్రభాకర్ కొనసాగింపు కథతో సీక్వెల్ ని తెరకెక్కించే ఆలోచన కూడా ఉందని ఈ సందర్భంగా దర్శకుడు సెల్వమణి వ్యాఖ్యానించారు. విజయ్ కాంత్ కుమారుడు షణ్ముగ పాండియన్ కూడా తన తండ్రిలానే నటించగలడు. ఇప్పుడు సీక్వెల్ ని షణ్ముగ పాండియన్ కథానాయకుడిగా రూపొందిస్తామని కూడా తెలిపారు. కెప్టెన్ ప్రభాకర్ (ఐఎఫ్ఎస్) కథతో సమానమైన స్థాయి ఉన్న కథను రూపొందిస్తామని కూడా చెప్పారు.

## రాజాసాబ్ కొత్త డేట్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న మూవీల్లో ది రాజాసాబ్ కూడా ఒకటి. హారర్ కామెడీ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న ఆ సినిమాకు స్టార్ డైరెక్టర్ మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. బాలీవుడ్ ప్రముఖ సంజయ్ దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. తమన్ మ్యూజిక్ అందిస్తున్న ఆ సినిమాను ప్రముఖ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ చివరి దశలో ఉండగా.. డిసెంబర్ 5వ తేదీన సినిమా రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. కానీ కొంతకాలంగా సంక్రాంతికి మూవీ విడుదల అవుతుందని జోరుగా ప్రచారం సాగుతోంది. ఆ తర్వాత టీజీ విశ్వప్రసాద్.. ఓ ఇంటర్వ్యూలో తెలుగు ఆడియన్స్ సంక్రాంతికి సినిమాను రిలీజ్ చేయమంటున్నారని చెప్పారు. కానీ నార్త్ వాళ్లు డిసెంబర్ లో విడుదల చేయమంటున్నారని తెలిపారు. దీంతో సంక్రాంతికి ప్రభాస్ రానున్నారని అంతా అనుకుంటున్నారు. కానీ దానిపై ఇప్పటి వరకు అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. అదే సమయంలో విశ్వప్రసాద్ నిర్మిస్తున్న మరో మిరాయ్ మూవీ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ రీసెంట్ గా జరిగింది. సెప్టెంబర్ 12న రిలీజ్ కానున్న ఆ సినిమా ట్రైలర్ ను గురువారం ఉదయం రిలీజ్ చేశారు. ఆ సమయంలో ప్రెస్ మీట్ నిర్వహించగా, విశ్వప్రసాద్ కూడా అటెండ్ అయ్యారు. అప్పుడు రాజాసాబ్ విడుదల తేదీపై క్లారిటీ ఇచ్చారు. "రాజాసాబ్ గురించి చాలా డౌట్స్ ఉన్నాయి.. డిసెంబర్ 5న వస్తుందా.. సంక్రాంతి వస్తుందా" అని ఓ మీడియా ప్రతినిధి అడగ్గా.. వెంటనే మనోజ్ అందుకున్నారు. అది రాజాసాబ్ ప్రెస్ మీట్ లో అడగండని చెప్పారు. వెంటనే ప్రొడ్యూసర్ గారు ఇక్కడ ఉన్నారు కాబట్టి అని అంటుండగా.. హలో హలో అంటూ మనోజ్ ఫన్ చేశారు. ఇంతలో విశ్వప్రసాద్.. రెస్పాండ్ అయ్యారు. రాజాసాబ్ మూవీ వచ్చే ఏడాది జనవరి 9వ తేదీన రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఇప్పుడు ఆ విషయం వైరల్ గా మారింది. మొత్తానికి క్లారిటీ ఇచ్చేశారని నెటిజన్లు, సినీ ప్రియులు కామెంట్లు పెడుతున్నారు. సంక్రాంతి బరిలోకి ప్రభాస్ అన్న అంటూ ట్రెండ్ చేస్తున్నారు. ఇది మామూలు అప్డేట్ కాదని.. సినిమా కోసం వెయిటింగ్ అని చెబుతున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613